ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు



ఆదివారం 5 అక్టోబరు 2025



ప్రత్తిపాడు : ఆటో కార్మికులతో ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు



తాడికొండ: ఆటోలో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

కాలుష్యం.. కాటేస్తోంది



- ముంచుకు వస్తోన్న ముప్పు
- ప్రమాదం అంటున్నా ప్రజల్లో నిర్లక్ష్యం
- ఢిల్లీ పరిస్థితులను చూసి మేల్కోని జనం
- ప్రభుత్వ కృషికి ప్రజా సహకారం ఉంటేనే కట్టడి

పొగ చూరిన గాలి.. రణగొణ ధ్వనుల తో పాటు ఆహారం, నీరు, భూమి, దేహం అంతటా కాలుష్యమే. స్వచ్ఛమైన గాలి ఇటు గుంటూరు నగ రం నుంచి మారుమూల పల్లె వరకు ఎక్కడా అందడంలేదు. దుమ్ము, ధూళి, దుర్వాసనతో కూడిన గాలి అంతటా నిండిపోయింది. రవాణా, గృహ నిర్మా ణాలు, పరిశ్రమల కార్యకలాపాలతో అటు వాయు, ఇటు ధ్వని కాలుష్యాలు ప్రజల ప్రాణాలను తీస్తున్నాయి. కాలుష్యం కాటేస్తున్నా ప్రజలు నిర్లక్ష్యం వీడటంలేదు. ప్రమాదం ముంచుకు వస్తోంది.. జాగ్రత్త అని పర్యావరణ వేత్తలు, ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా.. నా ఒక్కడితో ఏమవుతోంది.. నేనొక్కడినే మారాలా.. అనే ధోరణితో ఇటు ప్రజలు, లాభార్జన యావలో వ్యాపారులు కాలుష్యాలను నానాటికీ పెంచుకుంటూ వెళ్తున్నారు. వాయు, ప్లాస్టిక్ కాలుష్యాలతో క్యాన్సర్ తదితర ప్రాణాంతక జబ్బులు ఇప్పటికే పెరిగిపోయాయి. కాలుష్యాలతో డేంజర్ జోన్‌లోకి వెళ్లిన ఢిల్లీలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితులు నెలకొన్నాయని తెలిసి కూడా ప్రజలు నిర్లక్ష్యం వీడటంలేదు. ఇప్పటికైనా కళ్లు తెరిచి కాలుష్య కారకాలను కట్టడి చేసి, పర్యా వరణాన్ని సంరక్షించడంలో మన వంతుగా ఎవరికివారు కలిసి కట్టుగా కృషి చేయకపోతే భావితరాలకు తీరని అన్యాయం చేసిన వారమవుతాం.

వివరాలు 6లో..



ఆటో డ్రైవర్లకు చెక్కును అందజేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు నసీర్, మాధవి, కలెక్టర్ అన్సారియా తదితరులు

నియోజకవర్గ కేంద్రాల్లో సందడి..

- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో మంత్రి కందుల దుర్గేశ్ ఆటోడ్రైవర్లకు దుస్తులు బహూకరించి, సత్కరించారు. అనంతరం 100క పైగా ఆటోల్లో ర్యాలీ నిర్వహించారు.
- తాడికొండ మార్కెట్‌యార్డులో ఆటోడ్రైవర్లకు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ చెక్కులు పంపిణీ చేశా రు. అనంతరం తాడికొండ మెయిన్ రోడ్డు వరకు ఆటో లో ఎమ్మెల్యే ప్రయాణించారు.
- పొన్నూరులో పథకాన్ని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రారంభించారు. రేప ల్లె బస్టాండ్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో 1694 మం ది ఆటో డ్రైవర్లకు రూ.15 వేల చొప్పున రూ.2.54 కోట్లు చెక్కును అందజేశారు.
- ప్రత్తిపాడులోని ఎంపీడీవో కార్యాలయం వద్ద పథ కాన్ని ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రారంభించారు. తొ లుత టీడీపీ కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యా లయం వరకు ర్యాలీగా ఎమ్మెల్యే ఆటోలో చేరుకున్నారు.
- తాడేపల్లి మండలం గుండిమెడ గ్రామం నుంచి సీతానగరం ప్రకాశం బ్యారేజి వరకు కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహిం చారు. ఉండవల్లి సెంటర్‌లో ఆటో కార్మికులు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలా భిషేకం చేశారు.
- తెనాలిలో మార్కెట్ సెంటర్‌లో ముఖ్యమంత్రి చం ద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చి త్రపటాలకు ఆటో డ్రైవర్లు పాలాభిషేకం చేశారు.

ఆటోవాలాకు ఆర్థిక దన్ను

ఆటో డ్రైవర్ల సేవలో పై హర్షం

- ఆటోవాలాల ఖాతాలకు రూ.15 వేలు జమ
- ఆటోలు నడుపుతూ ర్యాలీల్లో ఎమ్మెల్యేలు, అధికారులు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా జిల్లాలో ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు చొప్పున ఆర్థిక లబ్ధి చేకూరింది. స్త్రీశక్తి పథకం సూపర్ హిట్ కావడంతో.. ఆటో డ్రైవర్లకు ఆదాయం తగ్గింది. దీంతో వారిని ఆర్థికంగా ఆదుకునేం దుకు ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని కూటమి ప్రభుత్వం శనివారం ప్రారంభించింది. ముఖ్య మంత్రి చంద్రబాబు బటన్ నొక్కిన వెంటనే ఆటోవాలల మొబైల్స్ మోగాయి. వారి ఖాతా లకు రూ.15 వేలు జమైనట్లు సమాచారంతో ఆటోవాలాలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశా రు. జిల్లా అంతటా పండుగ వాతావరణంలో 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ప్రారంభిం చగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కోలా హలంగా ఎమ్మెల్యేలు, కూటమి నేతలు, అధికారులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొ న్నారు. ముఖ్య మంత్రి విజయవాడలో పథక ప్రారంభోత్స కార్యక్రమాన్ని ఎల్ ఈడీ తెరల ద్వారా ఎక్కడికక్కడ నేతలు, అధికారులతో పాటు ఆటో డ్రైవర్లు వీక్షిం చారు. ఎక్కడికక్కడ ఆటోలతో డ్రైవర్లు ర్యాలీలు నిర్వహించారు.

- ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అందిస్తున్న కానుకే ఆటో డ్రైవర్ల సేవలో పథకమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, పర్యా టక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగిన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని కలెక్టర్ తమీమ్ అన్సా రియాతో కలిసి ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రతిఒక్కరూ బాగుండే విధంగా సీఎం చంద్ర బాబు చర్యలు తీసుకుంటున్నారని పెమ్మసాని తెలిపారు. కుడిచేత్తో ఇచ్చి.. ఎడమ చేత్తో లాక్కునే ప్రభుత్వం తమది కాదన్నారు. అంతకుముందు ఆటోలో మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్ తది తరులు ప్రయాణించి డ్రైవర్లను ఉత్సాహ పరిచారు.



పొన్నూరులో ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే నరేంద్ర

డీఎల్‌డీవో ప్రక్షాళన

- డివిజన్ల వారీగా కార్యాలయాలు, సిబ్బంది కేటాయింపు
- పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు
- గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర దిశగా అడుగులు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బాపట్ల డివిజన్ డీఎల్‌డీవో కార్యాలయం

(తెనాలి, ఆంధ్రజ్యోతి):

వైసీపీ హయాంలో మొక్కుబడి తంతుగా ఏర్పాటు చేసిన విభాగాల్లో డీఎల్‌డీవో వ్యవస్థ ఒక టి. రెవెన్యూ డివిజన్‌ల వారీగా 2020లో డీఎల్ డీవో(డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)లను అప్పటి ప్రభుత్వం కొలువుదీర్చింది. గ్రామాలను ప్రగతి బాట పట్టించడంలో అత్యంత కీలకంగా వీరు వ్యవహరించనున్నారని ప్రచార ఆర్భాటానికి తెరతీసింది. కానీ, నాలుగేళ్ల పాలనలో కనీసం వారికి సొంత కార్యాలయాలు, సిబ్బందిని నియ మించడం లేకపోగా.. కనీసం వారి విధులపై కూడా స్పష్టత లేకుండా వైసీపీ ప్రభుత్వం ఒక ప్రహసనంలా మార్చేసింది. కూటమి ప్రభుత్వం సదరు వ్యవస్థ ప్రక్షాళనపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగానే పంచాయతీరాజ్ అధికారులు గడచిన మూడు నెలలుగా డీఎల్‌డీవో అధికారులకు కేటా యించాల్సిన విధులపై స్పష్టతతో పాటు, జడ్పీ కార్యాలయాలతో వీరిని అనుసంధానం చేయ డంపై కసరత్తు చేశారు. డీఎల్‌డీవోలకు ప్రత్యేకం గా కార్యాలయాలు ఏర్పాటు చేసి, సిబ్బందిని కేటా యిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

పూర్తి ప్రక్షాళన

బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లోని డీఎల్‌డీవో విభాగాలు సరికొత్తగా దర్శనమివ్వబో తున్నాయి. దాదాపు ప్రతి డివిజన్‌లోనూ డీఎల్‌డీ వోల కోసం ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేశా రు. బాపట్ల డీఎల్‌డీవో కార్యాలయం కోసం ఏజీ కళాశాల రోడ్డులోని పాత మీ-సేవ కార్యాలయ భవనాన్ని సిద్ధం చేశారు. కలెక్టరేట్‌లో నరసరా వుపేట డీఎల్‌డీవో (మిగతా 6వ పేజీలో)

జిల్లాల వారీగా డివిజన్లు

బాపట్ల జిల్లాలో బాపట్ల, చీరాల, రేపల్లె, పల్నాడు జిల్లాలో సత్తెనపల్లి, నరసరావుపేట, గురజాల, గుంటూరు జిల్లాలో తెనాలి, గుంటూరు డివిజన్లకు డీఎల్‌డీవోల నియామకం గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. డివిజన్ స్థాయిలో పంచాయతీరాజ్ పరిధిలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, జడ్పీ నిధులను సమర్థంగా వినియోగించుకుని పల్లెలను అభివృద్ధి బాట పట్టించడం డీఎల్‌డీఓ విధులు. డ్వామా వంటి కీలక విభాగాలతో సమ న్వయం చేసుకుని మెరుగైన ఫలితాలు చూపెట్టడం వారి విధుల్లో కీలకం. కానీ, వైసీపీ ప్రభుత్వం వారిని కేవలం అలం కారప్రాయంగా మార్చేసి.. నియా మకాల ఉద్దేశాన్నే దాదాపుగా నీరు గార్చేసింది. ఒక్క డివిజన్‌లో కూడా ప్రత్యేక కార్యాలయం అన్న ఊసే లేకుండా చేసింది. ఎంపీడీవో కార్యా లయాల్లో నామమాత్రంగా డీఎల్ డీవోలకు ఓ గది కేటాయించి.. మమ అనిపించింది.

ఆర్‌అండ్‌బీ రోడ్లు జీఎంసీకి ఇవ్వాలి

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఆర్‌అండ్‌బీ రహదారులను జీఎంసీకి స్వాధీన పరచాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదే శించారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లపై కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి శనివారం పెమ్మసాని కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థకు ఆర్‌అండ్‌బీ రోడ్లు ఇవ్వడం వల్ల వాటి నిర్వహణ సులభతరం అవుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎంజీఎస్‌వై రూట్-3 పనులను పూర్తి చేయడంపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. నాబార్డ్ సంబంధిత 16 పనుల్లో 6 ఇంకా ప్రారంభం కాకపోవడానికి గల కారణాలపై ప్రశ్నించారు. రూ.6.30 కోట్లతో గుంటూరు - అమరావతి రోడ్డు పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. సమావేశంలో మేయర్ రవీంద్రబాబు, జేసీ అశుతోష్ శ్రీవాత్సవ, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, ఈఈ విశ్వనాథరెడ్డి, డీఈఈ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం బోర్డు సభ్యుడిగా.. బోడేపూడి నియామకం అభినందనీయం

● డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే కన్నా

గుంటూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఆలయ బోర్డు సభ్యుడిగా గుంటూరుకు చెందిన బోడేపూడి వెంకట సుబ్బారావు నియమితులు కావడం అభినందనీయమని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అభినందించారు. శనివారం గుంటూరులోని తన కార్యాలయానికి వచ్చిన రఘురామకృష్ణరాజు, కన్నా లక్ష్మీనారాయణకు సుబ్బారావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి సుబ్బారావుకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీశైలం శివయ్య భక్తులకు సేవలు అందించి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు సంపాదించాలన్నారు. మారుతి సుబ్రమణ్యం, వాసిరెడ్డి రవిచంద్ర, గోనుగుంట్ల హనుమంతరావు, గోరంట్ల సాంబశివరావు,తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, చలం, వజ్జా వీరాంజనేయులు, గంగినేని రామారావు, గంగినేని గురుస్వామి అభినందనలు తెలిపారు.


సుబ్బారావును అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

కాలుష్యం.. కాటేస్తోంది

గుంటూరు(తూర్పు), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాలుష్యం కంటికి కనబడదు. కానీ పెనుభూతంలా మారి మనల్నే మింగేస్తుంది. కళ్లెదుట ఢిల్లీ ఓ ప్రత్యక్ష ఉదాహరణ. రాత్రికిరాత్రే ఢిల్లీ కాలుష్యం కోరల్లో చిక్కుకోలేదు. సరైన చర్యలు లేకపోవడం.. ప్రజల్లో నిర్లక్ష్యం.. వంటి కారణా లతో ఢిల్లీవాసులు ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నారు. ఢిల్లీ అంతటి పరిణామాలు ప్రస్తుతం జిల్లాలో కనిపించకపోయినా భవిష్య త్తులో ముప్పు ముంచుకువస్తోందని తెలుస్తోంది. గాలి కాలుష్యంతో పాటు ప్లాస్టిక్, ఈ-వ్యర్థాలు ఇటు మానవుల ఆరోగ్యం, అటు పర్యావరణానికి పెనుముప్పుగా మారుతు న్నాయి. ప్రస్తుతం పెరిగిపోతున్న క్యాన్సర్ తదితర జబ్బులే ఇందుకు ఉదాహరణగా కనిపిస్తున్నాయి. ఇష్టం వచ్చినట్లుగా వినియోగిస్తున్న ప్లాస్టిక్‌తో కాలుష్యం నానాటికీ పెరిగిపో తోంది. ప్లాస్టిక్ గాలిలో, నీటిలో, ఆహారంలో కలిసి ప్రాణాలను తీస్తోంది. అయినా ప్రజలు నిర్లక్ష్యం వీడటం లేదు. ప్రస్తుతం జిల్లాలో ఏడాదికి 7 శాతానికి పైగా ఈ-చె త్త వస్తుందని గణాంకాలు చెబుతున్నాయి. ఇది 16-20 శాతానికి పెరిగితే ఈ-స్క్రాబ్ ఎమర్జెన్సీ ప్రకటించే అవకా శం ఉంటుంది. కాబట్టి దీనిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాలుష్యం కట్టడికి ప్రభుత్వ యంత్రాంగం కృషితో పాటు, అదేస్థాయిలో ప్రజలు సహక రించాలి. లేకపోతే స్వచ్ఛత, కాలుష్యం వంటి విషయాల్లో పరిష్కారం దొరకదని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఈ- చెత్తతో.. ఎండలు మండే

ఎలక్ట్రానిక్ పరికరాల విని యోగం నానాటికీ పెరిగిపో తోంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో ఇళ్లలో చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎలక్ట్రానిక్ పరికరాలను ఇష్టారీతిన వినియోగిస్తున్నారు. చెడిపోయిన తర్వాత వాటిని చెత్తలో వేస్తున్నారు. దీంతో ఈ-చెత్త(ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలు) పెనుముప్పుగా మారుతోంది. ఇళ్లలో, రోడ్లపై, కాల్వల్లో, నదుల్లో, సముద్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలకు మించి ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఈ-చెత్తతో గతంలో కంటే ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు రెండు శాతం మేర పెరగనున్నాయని వాతావరణ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ-చెత్త వ్యర్థాలపై అవగాహన, సైక్లింగ్ పరిశ్రమల స్థాపన వంటి విషయాలపై విజయవాడ, గుంటూరు నగరాల్లో అనేక సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా కార్యరూపం దాల్చలేదు.

గుంటూరులో గాలి కాలుష్యం

దేశవ్యాప్తంగా అధికంగా కాలుష్యం నమోదయ్యే 132 నగరాల్లో గుంటూరు కూడా ఒకటి. పరిశ్రమలు, గృహ, శబ్ద కాలుష్యాలు పెద్దగా లేకపోయినా వాయు కాలుష్యం వల్లే ఈ జాబితాలో గుంటూరు చేరింది. కాలం చెల్లిన వాహనాలతో నగరానికి ఈ పరిస్థితి వచ్చిందని కేంద్ర కాలుష్య నియంత్రణ సంస్థ తన నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం గుంటూరులో వాయు కాలుష్యం 65-67 మైక్రోగ్రామ్స్ క్యూబిక్ క్యూడ్(ఎమ్‌జీ క్యూక్యూ)గా మధ్య నమోదవుతుంది. 60 ఎమ్‌జీ క్యూక్యూ కంటే తక్కువగా ఉంటే సాధారణస్థితి. అయితే 2015లో గుంటూరులో వాయు కాలుష్య శాతం 63 ఎమ్‌జీ క్యూక్యూగా నమోదైనట్లు గణంకాలు చెబుతున్నాయి. అప్పట్లో దీనిపై జిల్లా ఉన్నతాధికారులు అత్యవసర సమావేశం నిర్వహించి ఎట్టి పరిస్థితిల్లో 2019 నాటికి వాయు కాలుష్య శాతాన్ని 58 ఎమ్‌జీ క్యూకి తీసుకురావాలని ఆదేశాలు జారీచేశారు. కానీ అది నేటికి కార్యరూపం దాల్చలేదు.

ఆరోగ్యంపై.. తీవ్ర ప్రభావం

- కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలతో జంతువులతో పాటు, మానవాళి ఆరోగ్యానికి పెను ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఊపిరితిత్తులతో పాటు ఇతర అవయవాలపై ప్రభావం చూపుతుంది.
- ప్లాస్టిక్‌ను కాలిస్తే డయాక్సిన్, ఫ్యూరాన్ విషవాయువులు క్యాన్సర్‌ను కలగజేస్తాయి.
- రంగుల సంచుల తయారీలో వాడే సీసం, క్యాడ్మియం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. సీసం పిల్లల పెరుగుదల, జ్ఞాపక శక్తిని హరిస్తోంది. క్యాడ్మియం కిడ్నీలను దెబ్బతీస్తుంది.
- ప్లాస్టిక్ కవర్లు, బాక్సుల్లో వేడి ఆహార పదార్థాలను నిల్వ చేస్తే ప్రమాదకరమైన ప్లాస్టిక్ గ్రాన్యుల్ పిగ్మంట్లు ఆయా పదార్థాల్లో కలసి క్యాన్సర్‌కు దారి తీస్తాయి.
- ప్లాస్టిక్ వ్యర్థాల పునర్ వినియోగ ప్రక్రియలో వెలువడే క్లోరినేటెడ్ హైడ్రోకార్బన్లు కేంద్రనాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయి.
- ఈ-చెత్త వల్ల మానవ ఎదుగుదల లోపాలు, బుద్ధిమాంద్యం, రోగనిరోధక వ్యవస్థను బలహీనం చేస్తోంది. గుండె, కిడ్నీలతో పాటు దేహంలోని కీలక అవయువాల పనితీరు దెబ్బతిస్తోంది.



వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి సూర్య కుమారి
● కలెక్టరేట్‌లో ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం


వేడుకల్లో ప్రసంగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి సూర్యకుమారి

గుంటూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమానికి నిబద్ధతతో కృషి చేస్తోందని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధ సంక్షేమ శాఖ సెక్రటరీ సూర్యకుమారి పేర్కొన్నారు. శనివారం కలక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం - 2025 రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ నారాయణస్వామి , రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ వయోవృద్ధుల సమస్యలను సాధ్యమైనంత వరకు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతేడాది వరకు రాష్ట్రంలో 50 వరకు మాత్రమే ఉన్న వృద్ధాశ్రమాలను 84కు పెంచడం జరిగిందన్నారు. మరో 13 ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించామని తెలిపారు. బృందంగా ఏర్పడిన వృద్ధులకు చిన్నపాటి కార్యక్రమాల నిర్వహణకు రుణాలు సైతం మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. ప్రతి జిల్లాలోనూ సీనియర్ సిటిజన్స్ భవనాల ఏర్పాటుకు స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సీనియర్ సిటిజన్ డిజిటల్ కార్డులు వాట్సాప్ ద్వారా అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఆసుపత్రిలోనూ ప్రత్యేక మైన వార్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు.

వృద్ధుల సలహాలతో సమస్యలు పరిష్కారం

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా స్థానిక సమస్యలను వయోవృద్ధుల నుంచే ఎక్కువగా తెలుసుకుంటానన్నారు. జీవితంలో గెలిచిన వారి సందేశాన్ని పిల్లలు స్ఫూర్తిగా తీసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ వేడు కల్లో పాఠశాల విద్యార్థులను భాగస్వామ్యం కల్పించడం జరిగిం దన్నారు. సీనియర్ సిటిజన్స్ మానసిక ఆనందం కోసం డే కేర్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన వయో వృద్ధుల వార్డును మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది పూర్తిస్థాయిలో ప్రారంభిం చడం జరుగుతుందన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల్లోని మహిళా పోలీసులు వయోవృద్ధుల రక్షణ బాధ్యతలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని, సీనియర్ సి టిజన్స్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు.

ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ.. మంచి మనసు ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు వృద్ధుల సంక్షేమానికి అన్ని కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ.. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జి.ప్రకాష్ రెడ్డి, డీఆర్‌వో ఎన్‌ఎస్‌కే ఖాజావలి, ఏడీ దుర్గాబాయి, సంక్షేమ సంఘం నాయకులు కె.రామచంద్రరావు, పరమేశ్వరరెడ్డి, వేంకటేశ్వర రావు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన వృద్ధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ శిక్షణ తరగతులను పరిశీలించిన జేడీ

గుంటూరు(విద్య),అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో జరుగుతున్న పీజీటీ, టీజీటీల శిక్షణ తరగతుల్ని పాఠశాల విద్యాశాఖ జేడీ, రాష్ట్ర పరిశీలకులు పి.శైలజ శనివారం పరిశీలించారు. శిక్షణా తరగతుల్ని సద్వినియోగం చేసుకోవాలని నూతన ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాల అంటే తల్లిదండ్రులకు నమ్మకం కలిగే విధంగా కృషి చేయాలన్నారు. ఏడీ టీవీ రమణ, సెంటర్ ఇన్‌చార్జి, ఎంఈఓ ఎండి ఖాసిం, పి.సుధారాణి, ప్రధానోపాధ్యాయులు ఆర్.గోవిందరాజులు, వి.వెంకట్రావు, ఏఎంఓ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.


శిక్షణ తరగతుల్ని పరిశీలిస్తున్న జేడీ శైలజ

పోరాట వీరులు చర్మకారులు

● లిడ్ క్యాప్ వ్యవస్థాపక దినోత్సవంలో కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నిప్పుల డప్పులతో గుండెచప్పుడు వినిపించే పోరాట వీరులు చర్మకారులని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం లిడ్ క్యాప్(చర్మ పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్) వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ నుంచి శిక్షణ పొందిన 300 మందికి సర్టిఫికెట్లను పెమ్మసాని, ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ అందజేశారు. ఈ సందర్భంగా కృత్రిమ జ్ఞానం కన్నా, ప్రకృతి జ్ఞానం మెండుగా నింపుకున్న మాదిగ సోదర సోదరీమణులందరికి వందనాలంటూ.. మంత్రి పెమ్మసాని శుభాకాంక్షలు తెలిపారు. ఛైర్మన్‌గా పిల్లి మాణిక్యరావు ఏపీ లిడ్ క్యాప్‌కు పూర్తిగా న్యాయం చేస్తూ, చర్మకారులకు అండగా నిలుస్తున్నారన్నారు. అందులో భాగంగానే 300 మందికి శిక్షణ ఇస్తూ 150 మందికి ప్లేస్మెంట్లు కూడా అందించడం అభినందనీయమన్నారు. శిక్షణ ద్వారా మంచి ఉద్యోగాల్లో చేరడం ఒకటైతే.. అందుబాటులో ఉన్న సాంకేతికతను ఉపయోగించుకొని, భారతీయ సంస్కృతిని అలవర్చుకొని మిషన్లతో పోటీ పడడం మరొకటి అన్నారు. ఇందులో ముఖ్యంగా క్వాంటిటీ కంటే క్వాలిటీకి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎన్ని వెరైటీలు అందుబాటులోకి తీసుకొస్తే.. అంతమంది ఆదరిస్తారన్నారు. జీవో నెంబరు 70 ద్వారా లోకల్ ప్రోడక్ట్‌లను తయారు చేసే అవకాశం కల్పిస్తున్నారన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అంది స్తోన్న సంక్షేమ పథకాలను అంది పుచ్చుకొని ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి , ఎండీ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ప్రసన్న వెంకటేష్ తదితరులున్నారు.


కేంద్ర మంత్రి పెమ్మసాని, మంత్రి దుర్గేష్, వర్ల రామయ్య, పిల్లి మాణిక్యరావులను గజమాలతో సన్మానిస్తున్న అభిమానులు

'డీఎల్‌డీవో' ప్రక్షాళన!

(5వ పేజీ తరువాయి)

కార్యాలయం ముస్తాబైంది. ఒక్కో కార్యాలయంలో కనీసం 8 నుంచి 12 మంది వరకు సిబ్బంది విధులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇక కార్యాలయాల మరమ్మతులు, ఫర్నీచర్, మౌలిక వసతుల కల్పనకు ఉమ్మడి జిల్లా జడ్పీ నుంచి ప్రత్యేక నిధులు కేటాయించినట్లు సమాచారం. పంచాయతీరాజ్ విభాగానికి సంబంధించి ఇటీవలే ప్రభుత్వం వివిధ విభాగాల అధికారుల హోదాపై స్పష్టత ఇస్తూ గెజిట్ కూడా విడుదల చేసింది. దానిలో డీఎల్‌పీవో, ఎంపీడీవోలుగా పనిచేస్తున్న వారు పదోన్నతిపై డీఎల్‌డీవోలు అవుతారని స్పష్టం చేసింది

సమర్థవంతంగా వినియోగించుకోవడానికి...

డీఎల్‌డీవో వ్యవస్థను పటిష్టంగా తీర్చిదిద్ది.. డివిజన్ స్థాయిలో జరిగే ప్రతి పనిపై వారి పర్యవేక్షణ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఫలితాల విషయంలో కూడా వారినే జవాబుదారీ చేయడం వల్ల పల్లె పనుల్లో వేగం పెంచవచ్చనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ఇందు కోసమే డివిజన్ స్థాయిలో రెవెన్యూ అధికారితో సమానంగా డీఎల్‌డీవోలకు కూడా ప్రత్యేక కార్యాలయం, సిబ్బందిని సమకూర్చి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది.

ఉమ్మడి జిల్లాలు కేంద్రంగానే...

జిల్లాల పునర్విభజన జరిగి మూడేళ్లు దాటినా జడ్పీ విభాగం మాత్రం ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే కొనసాగు తోంది. ప్రభుత్వం డీఎల్‌డీవోల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలనే నిర్ణయానికి వచ్చినప్పటికీ సత్వర నిర్ణయాల విషయంలో జడ్పీ సీఈవో ఆదేశాలే అంతిమం కానున్నాయి. నిధుల కేటాయింపు విషయంలో కొత్త జిల్లాల్లోని డివిజన్లకు కొన్ని చిక్కుముళ్లు ఎదురవు తున్నాయి. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టత నివ్వడం వల్ల జిల్లాల వారీగా కొత్తగా కొలువుదీరే జడ్పీల్లో డీఎల్‌డీవోల ప్రాముఖ్యం మరింతగా పెరగనుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నేడు పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

● తులసీ రామచంద్రప్రభు చేతుల మీదుగా రూ.24.50 లక్షల అందజేత



తులసీ యోగీష్‌చంద్ర

గుంటూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): 'కృష్ణదేవ రాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్, గుంటూరు', 'ఏపీ కేపీటీడబ్ల్యూఏ వారి సంయుక్త ఆధ్వర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 650 మంది పేద విద్యార్థులకు అమలాపురంలో ఆదివారం ఉపకార వేతనాల పంపిణీ చేయనున్నట్లు తులసీ గ్రూపు మేనేజింగ్ డైరక్టర్ తులసీ యోగీష్ చంద్ర తెలిపారు. విద్యార్థులకు మొత్తంగా రూ. 24.50 లక్షలను ఉపకార వేతనాలను అందజేయనున్నట్లు చెప్పారు. ఇందులో 331 మంది విద్యార్థులకు రూ. 11 లక్షల 84వేలు తులసి సీడ్స్ కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్ ద్వారా పేద విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ వారిచే 'ప్రతిభకు పట్టాభిషేకం' కార్యక్రమంలో భాగంగా ముక్తేశ్వరం రోడ్‌లోని సత్యనారాయణ గార్డెన్స్‌లో ఈ కార్యక్రమం జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి తులసీ గ్రూప్ సంస్థల చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు ముఖ్య అతిథిగా హాజరై ఉపకార వేతనాలను వితరణ చేయనున్నట్లు యోగీష్ చంద్ర వెల్లడించారు.

మౌంట్ లిటేరా జి స్కూల్ ఏర్పాటు శుభ పరిణామం

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలతో మాదల జయశ్రీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మౌంట్ లిటేరా జి స్కూల్ గుంటూరులో ఏర్పాటు చేయడం శుభ పరిణామమని కేంద్ర మంత్రి, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు, పలకలూరు రోడ్డు ఎల్ఐసి కాలనీలో అత్యుత్తమ ప్రమాణాలతో నెలకొల్పనున్న మౌంట్ లిటేరా జి స్కూలు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ మాదల చైతన్య, మీనా రత్న ఆధ్వర్యంలో గ్రామీణ విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో విద్యను అందించే దిశగా ఈ పాఠశాలను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. చదువు అంటే ర్యాంకులే ప్రామాణికం కాదని, క్రీడలు, విజ్ఞాన సముపార్జనే దిశగా కొనసాగించేలా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, మహమ్మద్ నసీర్ అహ్మద్, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాస్, వివిధ రకాల కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాఠశాల భవనానికి శంకుస్థాపన చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, బూర్ల రామాంజనేయులు, మాదల చైతన్య

గాంధీ పార్కులో తగిన లైటింగ్ ఉండేలా చూడాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గాంధీ పార్కులో తగినంత లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులకు ఆదేశిలిచ్చారు. అలాగే పార్కు పరిసరాల్లో మెరుగైన పారిశుధ్యం ఉండేలా చూడాలని సూచించారు. శనివారం కమి షనర్ గాంధీ పార్కు, ఎస్వీఎన్ కాలనీ, తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గాంధీ పార్కులో మొక్కలు నాటి నిత్యం పచ్చదనం ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రజారోగ్య కార్మికులు నగరంలో ప్రధాన రోడ్లను స్వీపింగ్ చేసి, వచ్చిన మట్టిని డివైడర్‌లో వేస్తున్నారని, అలా వేయకుండా చూడాలని అధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం ఆర్టీవో ఆఫీస్ రోడ్‌లోని అన్నా క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించి, టిఫిన్ చేసి, ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడారు.

సిమెంట్ పరిశ్రమలలో కాలుష్యాన్ని నియంత్రించాలి

● ఏపీపీసీబీ చైర్మన్ కృష్ణయ్య

గుంటూరు(తూర్పు), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సిమెంట్ పరిశ్రమలలో వస్తున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఆయా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి బోర్డు (ఏపీపీసీబీ) చైర్మన్ పి.కృష్ణయ్య కోరారు. మాచర్లలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కేసీపీ ఆడిటోరియంలో సిమెంట్ పరిశ్రమల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ రంగంలో సామాజిక బాధ్యతను విస్మరించవద్దని సూచించారు. సిమెంట్ పరిశ్రమల్లో కో ప్రాసెసింగ్ పద్ధతులు పాటించి, గ్రీన్ బఫర్ జోన్‌లో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రాంతీయ పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం మాట్లాడుతూ దుమ్ము, వాయు కాలుష్యాల్ని నిరంతరం పర్యవేక్షించి, నమోదు అవుతున్న శాతాలను గమనించాలని సూచించారు. అనంతరం సిమెంట్ పరిశ్రమ ఆవరణలో పి కృష్ణయ్య మొక్కలు నాటారు. ఈ సమావేశంలో కేసీపీ, చెట్టినాడ్, పరాశక్తి, భవ్య, శ్రీ చక్ర, ఆంధ్ర, శ్రీ సిమెంట్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



కేసీపీ సిమెంట్ పరిశ్రమలో మొక్కలు నాటుతున్న ఏపీపీసీబీ చైర్మన్ పి.కృష్ణయ్య, పాల్గొన్న ప్రాంతీయ పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు తొలి మహిళా గార్డు

గుంటూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు తొలి మహిళా గార్డుగా గుంటూరు రైల్వే డివిజన్‌కు చెందిన షేక్ రహంతున్నిసా బేగం నియమితులయ్యారు. ఆమె ఇప్పటి వరకు ప్యాసింజర్, మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో విధులు నిర్వహించడానికి ఆమెకు పూర్తిస్థాయిలో ట్రైనింగ్ ఇచ్చి పోస్టింగ్ చేశారు. ఒక మహిళ ఉద్యోగికి అరుదైన అవకాశం కల్పించినందుకు గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీపీఎంకి ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు వీవీ రమణయ్య, ఎస్ వీ అర్జున్, ఎల్ ఎస్ మూర్తి, స్టేషన్ మేనేజర్ శరత్‌బాబు, స్టేషన్ మాస్టర్ నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.



రహంతున్నిసా బేగంను అభినందిస్తున్న ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు

మద్యం మాఫియాపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం మాఫియాపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లాలో వెలుగు చూసిన నకిలీ మద్యం మాఫియా వెనుక ఉన్న ప్రభుత్వ పెద్దల పాత్ర బయట పడాలంటే సమగ్ర విచారణ జరిపించాల్సిందేనన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. నేషనల్ హైవేను ఆనుకొనే నకిలీ మద్యం తయారు చేస్తున్నారంటే కచ్చితంగా వారికి ప్రభుత్వ పెద్దల అండదండలు ఉన్నాయన్నారు.



ఆటోలో ప్రయాణిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి



ఆటోడ్రైవర్లకు సన్మానం చేస్తున్న మంత్రి దుర్గేశ్, ఎమ్మెల్యే నసీర్

ఆటోడ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● కేంద్ర, రాష్ట్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కందుల దుర్గేష్

● జిల్లాలో అట్టహాసంగా ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం

● 13,193 మంది లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ

గుంటూరు (తూర్పు), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అందిస్తున్న కానుకే ఆటో డ్రైవర్ల సేవలో పథకమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగిన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రులు ప్రారంభించారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెమ్మసాని చంద్రశేఖర్ ప్రసంగిస్తూ, 13,193 మంది లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ అయినట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ బాగుండే విధంగా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. తమది కుడి చేత్తో ఇచ్చి, ఎడమ చేత్తో లాక్కునే ప్రభుత్వం కాదని అన్నారు. ఆటోడ్రైవర్లకు విశ్రాంతి కోసం నగరంలో గదులును ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సాయంతో ప్రమాద బీమా, జీవిత బీమా చేయించుకోవాలని సూచించారు. ఆటోడ్రైవర్లు మహిళలతో గౌరవంగా మెలగాలని, ప్రయాణికులెవరైనా తమ వస్తువులు పోగొట్టుకుంటే వాటిని తిరిగి ఇచ్చేయాలని హితవు పలికారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు. అనంతరం కందుల దుర్గేష్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసిందని అన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. అంతకుముందు వేదిక వరకు ఆటోలో పెమ్మసాని, దుర్గేష్, ఎమ్మెల్యే పయనించి ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, మేయర్ కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి, డీటీసీ సీతారాంరెడ్డి, ఏపీ టెక్నాలజీస్ చైర్మన్ మోహన కృష్ణ, హజ్ కమిటీ చైర్మన్, ఏపీ ఇండస్ట్రీస్ చైర్మన్ డేగల ప్రభాకర్, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో చక్రానికి ఆయువు కూటమి ప్రభుత్వం

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల ఆర్థిక చక్రానికి కూటమి ప్రభుత్వం ఆయువు పోసిందని, వారి కుటుంబాలకు గుండె ధైర్యాన్నిచ్చిందని జిల్లా ఇన్చార్జి మంత్రి కందుల దుర్గేశ్, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఆటోడ్రైవర్ల సేవలో పథకం ప్రారంభం సందర్భంగా శనివారం తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు నూతన దుస్తులు బహూకరించి, సత్కరించారు. మంత్రి దుర్గేశ్, ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అనుభవమున్న డ్రైవర్ చేతిలో వాహనం ఉంటే ప్రయాణికులు ఎంత ధైర్యంగా ఉంటారో, ముఖ్యమంత్రి చంద్రబాబు చేతిలో రాష్ట్రాన్ని పెట్టిన ప్రజలు అంతే భరోసా ఉన్నారని తెలిపారు. అనంతరం బస్టాండ్ వద్ద ఆటో స్టాండ్‌లో ఎమ్మెల్యే నసీర్ ఆటోడ్రైవర్లలో కలిశారు. నసీర్ ఆధ్వర్యంలో సుమారు 100 కు పైగా ఆటోల్లో ర్యాలీగా రెవెన్యూ కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన సభకు బయలుదేరి వెళ్లారు.

పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి

● ఏపీ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి

గుంటూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏపీ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని ప్రధాన కార్యాలయం నుంచి వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. బ్రాడీపేట నుంచి లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ సర్కిల్ వరకు 200 మంది సిబ్బందితో సాగింది. అనంతరం టీజేపీఎస్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. చైర్మన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తెరగాలన్నారు. ఏసీవీవో వివేక్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ ప్రజలలో విజిలెన్స్ అవగాహనను పెంపొందించాలని విజ్ఞప్తి చేశారు. విజిలెన్స్ అవగాహనను పెంపొందించే ముఖ్యమైన నినాదాలను ప్రకటిస్తూ ప్లకార్డులను, బ్యానర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డీజీఎం వికాస వినీత్, బ్యాంక్ విజిలెన్స్ ఇన్‌ఛార్జ్ ఆఫీసర్ హరీష్‌బేతా, జనరల్ మేనేజర్లు తదితరులున్నారు.



మొక్కలు నాటుతున్న బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి, వివేక్‌కుమార్ గుప్తా తదితరులు

జీజీహెచ్‌లో యువకుడి చేతికి రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీ

గుంటూరు మెడికల్, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రన్నింగ్ మెషిన్‌లో చేయిపడి రక్తనాళాలు తెగిన యువకుడికి గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో వైద్యనిపుణులు శస్త్రచికిత్స చేసి తెగిన నాళాలు అతికించి చేతిని సంరక్షించారు. శనివారం తన ఛాంబర్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి ఈ కేసు వివరాలను తెలిపారు. మల్లికార్జున (21) పని చేస్తుండగా, రన్నింగ్ మెషిన్‌లో పడి ఎడమ చేతికి తీవ్ర గాయమైంది. వేళ్ల కదలికలకు సహకరించే రేడియల్, అల్నార్ రక్తనాళాలు పూర్తిగా తెగిపోయాయి. వెంటనే బాధితుడిని జీజీహెచ్‌కు తరలించారు. కార్డియోథొరాసిక్, వ్యాస్క్యులర్ సర్జరీ నిపుణులు తొలుత రక్తం ఎక్కించి అనంతరం రీకన్‌స్ట్రక్షన్ సర్జరీ చేశారు. కోలుకున్న మల్లికార్జునను శనివారం డిశ్చార్జి చేశారు. ఈ రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీకి ప్రైవేటు వైద్యశాలల్లో రూ.6 లక్షలు వసూలు చేస్తారని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ తెలిపారు. ఇటువంటి అత్యవసర శస్త్రచికిత్సలు ప్రభుత్వాస్పత్రిలో 24 గంటలూ అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు. సర్జరీ చేసిన కార్డియోథొరాసిక్ వైద్యనిపుణులను ఆయన అభినందించారు.

జిల్లా స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపికలు

గుంటూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 10 వరకు అండర్ 14, 17 బాల బాలికల అథ్లెటిక్స్, ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, యోగ పోటీలు జరగనున్నాయి. గుంటూరు తూర్పు, పశ్చిమ మండలాల స్థాయి టోర్నమెంట్, మండల స్థాయి జట్ల ఎంపికలు ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల పాత బస్టాండ్ సెంటర్, ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక హిందూ కళాశాల పాఠశాలలో గుంటూరు తూర్పు, పశ్చిమ మండల కోఆర్డినేటర్ల సమావేశం జరిగింది. సమావేశంలో కోఆర్డినేటర్లు డి.రాజేంద్రప్రసాద్, ఎస్.శాంతకుమారి, పి సాయిబాబు, శ్రీనివాసరావు, ప్రభాకర్, నగరంలోని వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో క్లాత్ బ్యాగ్ కియోస్క్

గుంటూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో ప్లాస్టిక్ కవర్ల స్థానంలో ప్రయాణికులు క్లాత్ బ్యాగులు వినియోగించేలా చేసేందుకు ఒక కియోస్క్‌ని గుంటూరు రైల్వే డివిజన్ అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. రూ. 10 నాణెం ఆ యంత్రంలోకి పెట్టగానే ఒక క్లాత్‌బ్యాగ్ ఆటోమేటిక్‌గా బయటికి వస్తుంది. డిజిటల్ విధానంలో నగదు చెల్లించినా ఆమోదించేలా చేశారు. ఈ కియోస్క్‌ని శనివారం డీఆర్ఎం సుధేష్ణ సేన్ ప్రారంభించారు. పర్యావరణ హితంగా రైల్వేస్టేషన్‌ని మార్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం రమేష్‌కుమార్, సీనియర్ డీఎంవో మద్దాళి రవికిరణ్ పాల్గొన్నారు.

భాషా పండితులకు పదోన్నతులు హర్షణీయం

● ఆర్‌యూపీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సాంబయ్య

గుంటూరు విద్య అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : గత 6 సంవత్సరాలుగా బదిలీలు, పదోన్నతులు లేక ఇబ్బందులు పడుతున్న భాషా పండితులకు పదోన్నతులు కల్పించడం హర్షణీయమని రాష్ట్రీయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి. సాంబయ్య అన్నారు. భాషా పండితుల ఇబ్బందులను, బాధలను అవగాహన చేసుకుని మంత్రి నారా లోకేష్ వారికి పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, భాషా పండితులకు దసరా రోజున పదోన్నతులు రావడం శుభపరిణామమని సాంబయ్య పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

గుంటూరు (విద్య), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావు అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్య పలు సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపుతోందని తెలిపారు. అందులో భాగంగి లాంగ్వేజ్ పండిట్ ఉపాధ్యాయులను స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. శాశ్వత స్థానం అంటూ ఏదీ లేకుండా పనిచేస్తూ గత ఆరేళ్లగా ఆ ఉపాధ్యాయులు చాలా బాధతో ఆ ఉపాధ్యాయులు ఉన్నారని, ఈ నేపథ్యంలో వారికి పదోన్నతులు కల్పించడం హర్షణీయమని అన్నారు. అదే విధంగా అంతర్ జిల్లా బదిలీలను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు.

లోక్ అదాలత్ శాశ్వత సభ్యుని నియామకానికి నోటిఫికేషన్

గుంటూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో శాశ్వత సభ్యుని నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మొదటి అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి, ఇన్‌ఛార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఏఎల్ సత్యవతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 31వ తేదీ నాటికి సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను న్యాయ సేవాధికార సంస్థలో పొందవచ్చని తెలిపారు.

శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో చీరలకు బహిరంగ వేలం

గుంటూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పొన్నూరు రోడ్డు సంగడిగుంట శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో దసర నవరాత్రులకు సమర్పించిన చీరలకు శనివారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, కార్యదర్శి మోరబోయిన నరసింహరావు ఆధ్వర్యంలో 350 చీరలకు వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టు వస్త్రాలతో పాటు ఇతర చీరలకు వేలంపాట నిర్వహించగా రూ.2.50 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

ఎఫ్‌డీసీ చైర్మన్ పదవిని భర్తీ చేయాలి : దిలిప్‌రాజా

గుంటూరు (తూర్పు), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) చైర్మన్ పదవిని భర్తీ చేయాలని సినీ దర్శకుడు దిలిప్‌రాజా ప్రభుత్వాన్ని కోరారు. అరండల్‌పేటలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కీలకమైన పదవిని భర్తీ చేయకపోవడంతో చలనచిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్లగా ఏ ఒక్క సినిమాకు సబ్సిడీ అందలేదని గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సినీ పరిశ్రమపై అవగాహన కలిగిన వ్యక్తికి పదవి ఇవ్వాలని దిలిప్‌రాజా కోరారు. ఈ సమావేశంలో నటుడు ఎర్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రెండ్



మా జీవితం మా హక్కు

కృత్రిమ మేథస్సు, సామాజిక మాధ్యమాలు విషపూరిత సమ్మేళనంగా మారిపోయాయి. మరీ ముఖ్యంగా కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు, సంస్థలు పేరు కోసం, విక్రయాల కోసం ప్రముఖుల స్వరాలు, ఆహార్యాలను అనుకరించే పోకడను అనుసరిస్తున్నారు. ఈ పోకడ నెటిజన్లను అలరిస్తున్నా, నటులను మాత్రం ఒకింత అసహనానికి గురి చేస్తోంది. కాబట్టే తాజాగా కొందరు ప్రముఖులు వారి వ్యక్తిగత హోదానూ, హుందాతనాన్నీ పరిరక్షించుకోవడం కోసం కోర్టుల ద్వారా 'పర్సనాలిటీ రైట్స్'ను పొందుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం!

ఐశ్వర్య దంపతులు సైతం

2024 మేలో, కొన్ని సంస్థలు జాకీ ష్రాఫ్ ఫొటోలను వాడుకుంటూ, అనధికారిక వస్తువుల అమ్మకాలు, వక్రీకరించిన వీడియోలతో వాణిజ్య లాభాలను ఆర్జిస్తున్నట్టు గుర్తించిన న్యాయస్థానం బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్ వ్యక్తిత్వ హక్కులకు కూడా రక్షణ కల్పించింది. అలాగే అనిల్ కపూర్ పేరు, ఫొటో, స్వరాలతో పాటు ఆయన సుప్రసిద్ధ క్యాచ్‌ఫ్రేజ్ 'ఝకాస్' అనే మాటను కూడా వినియోగించడానికి వీల్లేకుండా వ్యక్తిత్వ హక్కుల రక్షణను అనుమతించింది. అలాగే 2022 నవంబరులో హైకోర్టు అమితాబ్ బచ్చన్ వ్యక్తిత్వ, ప్రచార హక్కులు ఉల్లంఘనకు లోను కాకుండా రక్షణ కల్పించింది. గత సెప్టెంబరులో ప్రపంచసుందరి, బాలీవుడ్ నటి ఐశ్వర్యా రాయ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్‌లతో పాటు నిర్మాత కరణ్ జోహార్‌ల వ్యక్తిత్వం, ప్రచార హక్కులకు కూడా రక్షణ కల్పించడం విశేషం. కరణ్ జోహార్ విషయంలో, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, పిన్‌ట్రెస్ట్, యూట్యూబ్‌లతో సహా వివిధ సామాజిక మాధ్యమాల వేదికల నుంచి అశ్లీల మీమ్స్, పోస్టులను తొలగించాలని కోర్టు ఆదేశించింది. అటువంటి కంటెంట్‌ను సృష్టించడం కోసం ఒక ప్రముఖుడి వ్యక్తిత్వాన్ని అనధికారికంగా ఉపయోగించడం వల్ల ఆ ప్రముఖుడి పేరు ప్రతిష్ఠలు దెబ్బతిన్నట్టు పేర్కొంది.

మధుర గాయని కూడా...



ప్రముఖ హిందీ గాయని ఆశాభోంస్లే, కృత్రిమ మేథస్సు సహాయంతో తన స్వరాన్ని దుర్వినియోగపరుస్తున్న ఎఐ కంపెనీ మింక్ ఇంక్‌తో సహా అనేక సంస్థలకు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించారు. దాంతో ముందస్తు అనుమతి లేకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేదికలు, ఇ కామర్స్ సైట్‌లు, స్వతంత్ర విక్రేతలు ఆశాభోంస్లే స్వరాన్ని క్లోనింగ్ చేయడం లేదా ఆమె చిత్రాలు, పోలికలు, ఇతర వ్యక్తిత్వ లక్షణాలు దుర్వినియోగం కాకుండా బోంబే హైకోర్టు తాత్కాలిక రక్షణ కల్పించింది. డిజిటల్ యుగంలో ప్రముఖుల హక్కులను కాపాడే క్రమంలో న్యాయస్థానం ఇచ్చిన ఈ ఉత్తర్వు ప్రస్తుతం ఎంతో కీలకంగా మారింది.

నటుడు నాగార్జున కూడా...

పేరు, స్వరం, ఇమేజ్.. ఏ నటుడికైనా ఇవెంతో ముఖ్యం. వీటిని ఏ కారణంగా దుర్వినియోగపరిచినా ఏ నటులూ ఉపేక్షించరు. వెంటనే కోర్టును ఆశ్రయించి, వ్యక్తిత్వ హక్కులను పొందే ప్రయత్నం చేస్తారు. నటుడు నాగార్జున ఇదే చేశారు. తాజాగా తన వ్యక్తిత్వ హక్కులకు రక్షణ కల్పించాలంటూ ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించి, అనుమతి పొందారు. అక్రమ వాణిజ్య ప్రయోజనాల కోసం వస్తువులను విక్రయించడం కోసం తన వ్యక్తిత్వాన్ని దుర్వినియోగం చేస్తున్నట్టు, తన ఫొటోలను అశ్లీల ఫొటోలతో మార్ఫింగ్ చేస్తున్నట్టు, యూట్యూబ్‌లో వీడియోలు సృష్టించడం ద్వారా, కృత్రిమ మేథస్సు సహాయంతో తనను ఉగ్రవాద సంస్థలతో, జూదంతో అనుసంధానిస్తున్నట్టు నాగార్జున తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఒక ప్రముఖ వ్యక్తి ఇమేజ్‌ను తప్పుదారి పట్టిస్తూ, అనుచితమైన, అవమానకరమైన మార్గాల్లో వారి ప్రవర్తననూ, ఆహార్యాన్నీ అనుకరిస్తూ ప్రతిష్ఠకు భంగం కలిగించినప్పుడు, వాళ్ల గుడ్‌విల్ దెబ్బ తింటుందని పేర్కొంటూ, ఢిల్లీ హైకోర్టు, నటుడు అక్కినేని నాగార్జున వ్యక్తిత్వం, ప్రచార హక్కులను కాపాడుతూనే ఆయన ప్రమేయం లేకుండా, పేరునూ, ఇమేజ్‌నూ, స్వరాన్నీ వాణిజ్యపరంగా ఉపయోగించకుండా కట్టడి విధించింది.



సండే సెలబ్రిటీ



దక్షిణాది, హిందీ సినిమాల ద్వారా ప్రేక్షకులపై తనదైన ముద్ర వేసిన హీరోయిన్ రాశీ ఖన్నా, తాజాగా ఆమె నటించిన 'తెలుసు కదా' సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆమెను 'నవ్య' పలకరించింది.

అలాగైతే పాతబడిపోతాం...

'తెలుసు కదా' టీజర్‌కు మంచి స్పందన వచ్చింది కదా... ఎలా అనిపిస్తోంది?

చాలా ఆనందంగా అనిపిస్తోంది. సినిమాను బాగా ప్రమోట్ చేస్తున్నాం. చాలా కాలం తర్వాత నేను చేస్తున్న తెలుగు సినిమా ఇది. కాబట్టి చాలా ఎక్సైటింగ్‌గా ఉంది. నాకు హైదరాబాద్‌లో ఇల్లు ఉంది. వచ్చిపోతూ ఉంటాను. ఇక్కడ షూటింగ్ జరుగుతూ ఉంటే పుట్టింటికి వచ్చినట్లు అనిపిస్తోంది.

మీరు అనర్గళంగా మంచి తెలుగు మాట్లాడుతున్నారు... ప్రాక్టీస్ చేశారా?

చాలాకాలంగా తెలుగు సినిమాలు చేస్తున్నాను కదా! తెలుగు వచ్చేసింది. నాకు తెలుగే కాదు... తమిళం, హిందీ కూడా బాగా వచ్చు. ప్రేక్షకులతో నేరుగా కనెక్ట్ కావటానికి భాష చాలా ప్రముఖమైన పాత్ర పోషిస్తుంది. అంతేకాదు... ఇది ఆయా భాషల ప్రేక్షకులకు నేను ఇచ్చే కనీస గౌరవం.

> నా తల్లితండ్రులు, మా అన్నయ్య, ఇద్దరు స్నేహితులు వీరందరూ నాకు మంచి సపోర్ట్. నాకు ఏ చిన్న సమస్య వచ్చినా వాళ్లతో చెబుతా!

మీరు హిందీ ప్రాజెక్టుల్లో కూడా నటించారు కదా... బాలీవుడ్‌కు, టాలీవుడ్‌కు ఉన్న తేడా ఏమిటి?



టాలీవుడ్‌లో హీరోయిన్లకు చాలా గౌరవం లభిస్తుంది. చాలా ఆదరంగా చూస్తారు. పైగా కాల్షీట్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల దాకానే ఉంటుంది. బాలీవుడ్‌లో కానీ, తమిళ పరిశ్రమలో కానీ కాల్షీట్ పన్నెండు గంటలు ఉంటుంది. అందువల్ల ఎక్కువగా అలసిపోతాం. అంతేకాకుండా ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. తెలుగు ప్రేక్షకులకు నా పట్ల అభిమానం ఎక్కువ. నేను ఇతర భాషల్లో చేసిన సినిమాలను కూడా వారు ఆదరిస్తూ ఉంటారు. సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తూ ఉంటారు.

> నేను భవిష్యత్తు గురించి పెద్దగా ఆలోచించను. ఎందుకంటే భవిష్యత్తులో ఏం జరుగుతుందో మనకు తెలియదు. చిన్నప్పుడు నేను ఐఏఎస్ ఆఫీసర్ కావాలనుకొనేదాన్ని. అనుకోకుండా హీరోయిన్ అయ్యా. ఇలా మనం అనుకున్నవన్నీ కావు.

బాలీవుడ్‌లో దక్షిణాది నటీనటుల పట్ల వివక్ష ఉందని విమర్శలు వినిపిస్తూ ఉంటాయి...

నాకు అలాంటి ఫీలింగ్ ఎప్పుడూ రాలేదు. అంతేకాదు, ఓటీటీ వచ్చిన తరువాత భాషపరమైన సమస్యలు తొలగిపోయాయి. ఇక్కడ హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు చూస్తున్నారు. అక్కడ దక్షిణాది సినిమాలు చూస్తున్నారు. ఓటీటీలు వచ్చిన తర్వాత మంచి నటులకు అన్ని భాషల్లోను అవకాశాలు లభిస్తున్నాయి.

నటనపై మీ అభిప్రాయమేమిటి?

నటనను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉండాలి. నేను సినిమా రంగానికి వచ్చినప్పుడు నాకు ఏదీ తెలియదు. మనసుకు ఎలా అనిపిస్తే అలా నటించేదాన్ని. ఆ తర్వాత నటనకు కొన్ని టెక్నిక్స్ ఉంటాయని తెలిసింది. పుస్తకాలు చదవటం మొదలుపెట్టా. వీడియోలు చూసేదాన్ని. ముంబాయిలో నాటక రంగంలో పనిచేశా. ఎప్పటికప్పుడు నేర్చుకోపోతే ప్రేక్షకులకు బోర్ కొడుతుంది. మనం పాతపడిపోతాం!

మీరు స్క్రిప్ట్‌లు ఎలా ఎంపిక చేసుకుంటారు?

> ఒక నటిగా నాకు ఎప్పుడూ అభద్రతా భావం లేదు. నన్ను నేను ఎవ్వరితోను పోల్చుకోను. ప్రతి వ్యక్తికి తనదైన జర్నీ ఉంటుంది.

నేను చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటా. నా పాత్ర ఎలా ఉందనే విషయంపైనే ఎక్కువ దృష్టి పెడతా! కొన్నిసార్లు డైరక్టర్లు వచ్చి కథలు చెబుతారు. వాళ్ల దగ్గర స్క్రిప్ట్ ఉండదు. అలాంటప్పుడు చాలా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కొన్నిసార్లు ఇతర కారణాల వల్ల కూడా ప్రాజెక్టులు ఓకే చేస్తా. కొందరు డైరక్టర్లకు మంచి దార్శనికత ఉంటుంది. అలాంటప్పుడు ఎలాంటి సమస్య ఉండదు. వారు చెప్పినట్లు చేసేస్తాను. కొందరు వచ్చి సలహాలు అడుగుతారు. నాకు తెలిసినంత చెబుతాను.

మీకు ఏ తరహా పాత్రలు చేయాలని ఉంది?

నాకు హారర్ ఫిల్మ్ చేయాలని ఉంది. ఎందుకంటే నాకు హారర్ సినిమాలంటే ఇష్టం. మైథాలజీ, యాక్షన్ ఫిల్మ్స్ కూడా చేయాలని ఉంది.

> నాకు ఓషో అన్నా, బ్రహ్మకుమారిల మార్గమన్నా ఇష్టం. ఆధ్యాత్మికతపై నాకు అవగాహన ఉంది. నేను ఈ పరిశ్రమలో నెగ్గుకురావటానికి అది కూడా ఒక కారణం. నేను ఏ పనిచేసినా నిబద్ధతతో చేస్తా. అయితే ఫలితాలు నా చేతిలో ఉండవనే విషయం కూడా నాకు తెలుసు.

మీరు సినిమాలూ చేశారు, వెబ్ సిరీస్‌లూ చేశారు. రెండింటి మధ్యా తేడా ఏమిటి?

కొంత తేడా ఉంది. వెబ్ సిరీస్‌లలో పాత్రల్లో అనేక కోణాలు ఉంటాయి. వాటిని చూపించటానికి ఎక్కువ సమయం ఉంటుంది. సినిమాల్లో అంత సమయం దొరకదు. అయితే నాకు సినిమాలంటేనే ఇష్టం.


• సీవీఎల్ఎన్ ప్రసాద్

అమ్మో ఐ బొమ్మ

ప్రపంచంలో సినిమాను ప్రేమించే ప్రేక్షకులు ఉన్నంత కాలం, పైరసీ అనే భూతం వెంటాడుతూనే ఉంటుంది. ముఖ్యంగా తెలుగు సినీ పరిశ్రమను వణికిస్తున్న అలాంటి పైరసీ వెబ్‌సైట్లలో 'ఐ బొమ్మ' ఒకటి. ఈ పేరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కొత్త సినిమా థియేటర్లలో విడుదలైన కొద్ది గంటల్లోనే, లేదా ఓటీటీలోకి వచ్చిన మరుక్షణమే హై - క్వాలిటీ ప్రింట్‌తో ఈ సైట్‌లో ఉచితంగా అందుబాటులోకి వస్తోంది. అయితే ఈ ఉచిత వినోదం తెలుగు సినిమా నిర్మాతలకు రూ. వేల కోట్ల నష్టం తెస్తోంది.

పైరసీ మాఫియా

'మూవీ రూల్స్, ఐ బొమ్మ లాంటి సైట్స్ కేవలం సినిమాలను అప్‌లోడ్ చేసే వేదికలు మాత్రమే కాదు. దీని వెనుక ఒక పకడ్బందీ వ్యవస్థ ఉంది. అంతర్జాతీయ నెట్‌వర్క్ పనిచేస్తోంది'ని సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. పైరసీ వల్ల తెలుగు సినీ పరిశ్రమకు వేల కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ఒక్క 2024లోనే పైరసీ వల్ల తెలుగు చిత్ర పరిశ్రమకు రూ. 3700 కోట్ల భారీ నష్టం వాటిల్లిందని మాజీ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.



చిన్న సినిమాల పాలిట విలన్

భారీ బడ్జెట్ చిత్రాలు, పాన్ ఇండియా చిత్రాలకు ఓటీటీ, శాటిలైట్ హక్కుల ద్వారా కొంతమేర నష్టం తగ్గినా, పైరసీ వల్ల అత్యధికంగా నష్టపోతున్నది మాత్రం చిన్న సినిమాలే. పలు సందర్భాల్లో చిన్న నిర్మాతలు, దర్శకులు వెలిబుచ్చిన ఆవేదన దీనికి అద్దం పడుతోంది. 'మా కలలను, మా పెట్టుబడినీ పైరసీ చంపేస్తోంది. మా పెట్టుబడిలో ఒక్క పైసా కూడా తిరిగి రావడం లేదు. ఇది ఇలాగే కొనసాగుతూ ఉంటే మరో సినిమా ఎలా తీయగలం' అని చిన్న నిర్మాతలు, దర్శకులు ప్రశ్నిస్తున్నారు. థియేటర్ల ద్వారా పెట్టుబడిలో కొంతైనా రాబట్టుకోవాలని చూసే చిన్న నిర్మాతల ఆశలపై ఐ బొమ్మ నీళ్లు చల్లుతోందనడంలో సందేహం లేదు. అలాగే పైరసీ అనేది థియేటర్ల ఆదాయంతో పాటు ఓటీటీ రెవెన్యూను సైతం దెబ్బతీస్తోంది. థియేటర్లలో విడుదలతో పాటు ఓటీటీల ఆదాయానికి ఐ బొమ్మ లాంటి సైట్లు గండికొడుతున్నాయి.

పోలీసులకు సవాల్

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఐ బొమ్మతో సహా 65కు పైగా పైరసీ వెబ్‌సైట్లపై దర్యాప్తును ముమ్మురం చేశారు. ఐ బొమ్మపై దృష్టి సారించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్‌లో భాగమైన కొందరు ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. దాని నిర్వాహకులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ పైరసీ రాకెట్ హైదరాబాద్‌తో పాటు దుబాయ్, నెదర్లాండ్ వంటి విదేశీ ప్రాంతాల నుంచి పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పైరసీముఠా కొన్ని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, రికార్డింగ్, ఎడిటింగ్, అప్‌లోడింగ్, మానిటైజేషన్ చేస్తున్నట్లు వెల్లడించారు.

ఛేజింగ్ గేమ్

ఐ బొమ్మ లాంటి పైరసీ సైట్లు తమ డొమైన్లను తరచూ మార్చడం, సర్వర్లు విదేశాల్లో ఉండడం వల్ల వాటిని శాశ్వతంగా మూసివేయడం పోలీసులకు, పైరసీ సెల్‌లకు పెద్ద సవాల్‌గా మారింది. ఒక డొమైన్‌ను బ్లాక్ చేస్తే కొద్ది రోజుల్లోనే అది కొత్త పేరుతో కొత్త లింక్‌తో మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇంటర్నెట్ ప్రపంచంలో ఇదొక అంతుచిక్కని 'ఛేజింగ్ గేమ్'గా మారిపోయింది.

పరిష్కారం ప్రేక్షకులు చేతుల్లోనే!

పైరసీని పూర్తిగా రూపుమాపడం కష్టమే అయినా, సినీ పరిశ్రమ, ప్రభుత్వం, ప్రేక్షకులు కలసి పోరాడాల్సిన అవసరం ఉంది. అయితే ముఖ్యంగా మారాల్సింది ప్రేక్షకులే. పైరసీ లింక్‌లను ప్రోత్సహించకుండా, నాణ్యమైన వినోదం కావాలంటే థియేటర్లలో చూడడం, చట్టబద్ధమైన ఓటీటీ వేదికలను ఆదరించడం ఒక్కటే ఈ భూతం నుంచి తెలుగు సినిమాను రక్షించే మార్గం. వేల మంది కళాకారులు, సాంకేతిక నిపుణుల కష్టం, కలలకు ప్రతిరూపమైన సినిమాను పైరసీ కోరల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ట్రూ హంటింగ్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 06
వార్ 2	హిందీ చిత్రం	అక్టోబర్ 09
ది ఉమన్ ఇన్ కేబిన్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 09
కురుక్షేత్ర	హిందీ సిరీస్	అక్టోబర్ 10
అమెజాన్ ప్రైమ్		
మెయింటనెన్స్ రిక్వైర్డ్	ఒరిజినల్ మూవీ	అక్టోబర్ 08
జాన్ కేండీ	డాక్యూ మూవీ	అక్టోబర్ 10
జియో హాట్‌స్టార్		
మిరాయ్	తెలుగు చిత్రం	అక్టోబర్ 10
సెర్చ్: ది నైనా మర్డర్ కేస్	హిందీ సిరీస్	అక్టోబర్ 10

రంగురంగుల గాజులతో రమ్యంగా..

ఆభరణాలన్నింటిలో గాజులకు ప్రత్యేక స్థానం ఇస్తుంటారు మహిళలు. ఎన్ని నగలు పెట్టుకున్నా.. అందమైన గాజులు వేసుకోకపోతే అలంకరణ పూర్తికానట్టే! ఒకప్పుడు.. పెళ్లయిన మహిళలు చేతినిండా మట్టిగాజులు వేసుకునేవారు. యువతులు రంగురంగుల లక్క గాజులు, ప్లాస్టిక్ లేదా నైలాన్ గాజులు వేసుకునేవారు. క్రమంగా బ్లాక్ మెటల్, వైట్ మెటల్ బ్యాంగిల్స్ వచ్చేశాయి. ఇవి కాలేజీ యువతులను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఇక బంగారు గాజులు ఎప్పటికీ ప్రత్యేకమే. వాటిమీద కెంపులు, పచ్చలు, వజ్రాలు, ముత్యాలు, నీలాలు పొదిగి ఎన్నో అద్భుతమైన డిజైన్లను అందుబాటులోకి తెస్తున్నారు. వీటిని కేవలం పండుగలు, వివాహాది శుభకార్యాలకు మాత్రమే పరిమితం చేస్తున్నారు మహిళలు. రోజువారీ వేసుకోవడానికి వీలుగా మారుతున్న పోకడలకు అనుగుణంగా రకరకాల రాళ్ల గాజులు, థ్రెడ్ బ్యాంగిల్స్ అందుబాటులోకి వచ్చేశాయి. సీజెడ్, టోరమలీన్, టోపాజ్ లాంటి మామూలు రాళ్లతో డిజైన్ చేసిన గాజులను మహిళలు ఎక్కువగా ఆదరిస్తున్నారు. డ్రెస్‌కు మ్యాచ్ అయ్యేలా రంగుల దారాలు చుట్టిన గాజులు కూడా యువతులను ఆకర్షిస్తున్నాయి. కాలేజీకైనా కార్యాలయానికైనా వెళ్లేటప్పుడు చేతికి ఒక్క గాజు వేసుకుంటే చాలనుకుంటున్నారు. అంతలా మహిళల మనసు దోచుకున్న రంగురంగుల గాజులపై ఓ లుక్కేద్దామా...





దారాల గాజులు

ప్లాస్టిక్, లేదా మెటల్ బ్యాంగిల్స్‌కు రంగురంగుల పట్టుదారాలను ఒక క్రమంలో చుట్టి కొనలను గమ్‌తో అంటిస్తారు. రెండు లేదా మూడు రంగుల దారాలను అందమైన డిజైన్ ప్రకారం చుట్టి తయారుచేసిన గాజులు గ్రాండ్‌గా కనిపిస్తాయి. వీటి మీద రంగురంగుల కుందనాలు, రాళ్లు, ముత్యాలు, బీడ్స్ కూడా అతికిస్తుంటారు. మువ్వలు వేలాడదీస్తుంటారు. సన్నగా, వెడల్పుగా లేదంటే లావుగా ఇలా ఏ ఆకారంలో కావాలంటే అలా ఇంట్లోనే దారాల గాజులు తయారు చేసుకోవచ్చు. గోట్స్ సైడ్ బ్యాంగిల్స్ మాదిరిగా డిజైన్ చేసుకుని చేతులకు వేసుకుంటే నలుగురిలో ప్రత్యేకంగా కనిపిస్తారు. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నీలం రంగుల దారాలతో లావుపాటి గాజులు సిద్ధం చేసుకుంటే రోజువారీ వేసుకోవడానికి బాగుంటాయి.



సీజెడ్ గాజులు

వజ్రాలకు ప్రత్యామ్నాయంగా సీజెడ్స్ ఉపయోగించి తయారుచేసే రాళ్ల గాజులను యువతులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం వివిధ రంగుల్లో సీజెడ్స్ లభ్యమవుతున్నాయి. ఒక గ్రాము బంగారం లేదా వెండి ప్లేటింగ్‌తో పలు డిజైన్లలో రంగురంగుల సీజెడ్‌లను కూర్చి గాజులు రూపొందిస్తున్నారు. సింగిల్ లైన్, మల్టిపుల్ లైన్స్ బ్రేస్‌లెట్ స్టయిల్ గాజులు అందుబాటులో ఉన్నాయి. వజ్రాలను పోలిన కటింగ్‌తో తళతళలాడే సీజెడ్ గాజులు... సంప్రదాయ దుస్తులతోపాటు మోడరన్ డ్రెస్‌ల మీద కూడా చక్కగా నప్పుతాయి.



టోరమలీన్ గాజులు

టోరమలీన్ రాళ్లు పొదిగిన గాజులు ప్రత్యేకంగా కనిపిస్తాయి. విభిన్నమైన కటింగ్ విధానం వల్ల ఈ రాళ్లు నలువైపులా కాంతులు విరజిమ్ముతుంటాయి. గులాబీ, ఎరుపు, ఆకుపచ్చ, నీలం, నలుపు, గోధుమ రంగుల్లో లభించే టోరమలీన్ రాళ్ల గాజులను మహిళలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. పట్టుచీరలు లేదా భారీ ఎంబ్రాయిడరీ వర్క్‌లతో నిండిన లెహంగాల మీద ఇవి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. రోజువారీ వేసుకోవడానికి కూడా సౌకర్యవంతంగా ఉంటాయి.



టోపాజ్ గాజులు

రంగురంగుల టోపాజ్ రాళ్లను కూర్చి రూపొందించిన గాజులు కూడా మహిళలను ఆకట్టుకుంటున్నాయి. లక్క, ప్లాస్టిక్, మెటల్ గాజుల మీద పలు ఆకారాల్లో ఉన్న టోపాజ్ రాళ్లను అతికిస్తారు. నీలం, గులాబీ, ఆకుపచ్చ, పసుపు రంగుల్లో చిన్న, పెద్ద సైజుల్లో ఉన్న టోపాజ్ రాళ్లతో చాలా రిచ్‌గా కనిపిస్తాయి ఈ గాజులు. వెడల్పుగా గోట్ మాదిరి కనిపించే ఈ గాజులను చేతికి ఒక్కటి వేసుకున్నా గ్రాండ్‌గా ఉంటుంది.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

శ్రమజీవుల స్వేచ్ఛ కోసం పుట్టిన స్వరం.. సురవరం

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

మంగళగిరి సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రమజీవుల స్వేచ్ఛ, సమానత్వం, సమసమాజ స్థాపన కోసం పుట్టిన స్వరం సురవరం సుధాకర్‌రెడ్డి అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగింది. ఈ సభకు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ ఎంతో మంది రాజకీయ నాయకులు వచ్చి పోతుంటారని, సురవరం వంటి కొందరు వ్యక్తులు మాత్రమే సమాజాన్ని ప్రభావితం చేయగలుగుతారని చెప్పారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఆఖరి శ్వాస వరకు నిలబడిన గొప్ప వ్యక్తి సురవరం అని కొనియడారు. అనంతరం సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కే.నారాయణ మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి అన్ని రాజకీయ పార్టీల నాయకులతోనూ సఖ్యతగా మెలుగుతూ రాజకీయంగా విధాన పరమైన అంశాల్లో మాత్రమే విభేదించే వారని చెప్పారు. నేటి రాజకీయ విభేదాలు శత్రుత్వంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సురవరం తుదిశ్వాస వరకు కమ్యూనిస్టుగానే బతికి కళంకం లేని వ్యక్తిగా నిలిచిపోయారని తెలిపారు. తొలుత సురవరం చిత్రపటానికి నేతలు పూలమాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, జనసేన నేత గంజి చిరంజీవి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాజధాని ప్రాంతంలో శాంతి భద్రతలపై ప్రత్యేక శ్రద్ధ

● ఎస్పీ వకుల్ జిందాల్
● తుళ్లూరు, తాడికొండ పోలీస్ స్టేషన్ల సందర్శన



తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ, సీఐలకు తగిన సూచనలు చేస్తున్న ఎస్పీ జిందాల్

తుళ్లూరు/ తాడికొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శనివారం తుళ్లూరు, తాడికొండ పోలీస్‌స్టేషన్లను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, నేరాలు, కేసులు వివరాల గురించి సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ రాజధాని అమరావతి ప్రాంతంలో తుళ్లూరు, తాడికొండ పోలీస్‌స్టేషన్లు చాలా ప్రధానమైనవని చెప్పారు. ఈ పోలీస్ స్టేషన్ల పరిధిలోనే సెక్రటేరియట్, హైకోర్టు ఉన్నందున ఏ చిన్న ఘటన జరిగినా అది సున్నితమైన అంశంగా మారే అవకాశం ఉంటుందని చెప్పారు. కనుక ఈ ప్రాంతాన్ని హై సెక్యూరిటీ జోన్‌గా పరిగణించి, భద్రతా అంశాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని, లా అండ్ ఆర్డర్ సమస్యలు రాకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, మరికొన్ని కెమెరాలను సీఆర్డీఏ సహకారంతో ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. అలాగే ఈ ప్రాంతంలో డ్రోన్ల ద్వారా నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ మురళీకృష్ణకు, సీఐలు కొంకా శ్రీనివాసరావు, అంజయ్యలకు ఎస్పీ ఆదేశించారు.

ఆటోడ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీ అనిత

దుగ్గిరాల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల సేవలో పథకం ద్వారా ఆటోడ్రైవర్లను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత అన్నారు. ఉండవల్లిలో జరిగిన ఆటో డ్రైవర్ల సేవ పథకం కార్యక్రమానికి దుగ్గిరాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో పలువురు ఆటోడ్రైవర్లు తరలి వెళ్లారు. ఆటోడ్రైవర్లతో ఉండవల్లికి బయలుదేరిన బస్సులను దుగ్గిరాల మండల కూటమి నాయకులు జెండా ఊపి సాగనంపారు. ఈ కార్యక్రమంలో యార్డుచైర్మన్ ఉన్నం ఝాన్సీరాణి, చుండూరు ఉమా మహేశ్వరరావు, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, గూడూరు వెంకట్రావు, జనసేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, కేసంనేని వాసు, జున్నూఖాన్, నక్కా చిరంజీవి, దేవరపల్లి చంటి, ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రమోహన్, డిప్యూటీ ఎంపీడీఓ జవహర్‌లాల్, ఈవో వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

వీరయ్యచౌదరి ఆశయాలను కొనసాగిద్దాం

● మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ



పర్వతనేని వీరయ్యచౌదరి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ

పెదనందిపాడు, అక్టోబరు, 4 (ఆంధ్రజ్యోతి): పన్నుల నిరాకరణోద్యమ రథసారథి పర్వతనేని వీరయ్యచౌదరి ఆశయాలను కొనసాగించడమే ఆయనకిచ్చే ఘన నివాళని మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ అన్నారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో సుభిక్షా సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆంధ్ర శివాజీ పర్వతనేని వీరయ్యచౌదరి 139వ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్రా బాలకృష్ణ మాట్లాడుతూ, జాతిపిత గాంధీ పిలుపు మేరకు శాంతియుతంగా పన్నుల సహాయనిరాకరణ ఉద్యమం చేపట్టి బ్రిటీష్ సైన్యాన్ని గడగడలాడించిన మహోన్నత వ్యక్తి వీరయ్యచౌదరి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కొల్లా సీతారామయ్య, జిల్లా తెలుగురైతు కార్యదర్శి మోపర్తి చెంచయ్య, అశోకా పాఠశాల డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయురాలు మక్కెన జవహర్‌రాణి, మల్లంపాటి అమ్మయ్య, లావు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఇరువర్గాల ఘర్షణ

● పరస్పర కేసులు నమోదు

కాకుమాను, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో రెండు వర్గాలు ఘర్షణ పడి పరస్పరం కేసులు నమోదు చేసుకున్న ఘటన పెదనంది పాడులో జరిగింది. మండలంలోని వరగాని గ్రామానికి చెందిన నూనె శివ నాగరాజు అతని స్నేహితులు కాకుమానులో ఒక వైన్ షాపుకు మద్యం కొనుగోలు చేయడానికి వెళ్లారు. అక్కడ మద్యం తాగుతున్న ఫిరోజ్‌తో వారికిస్వల్ప వివాదమైంది. దాంతో ఫిరోజ్ బీర్ బాటిల్‌తో శివనాగరాజు తలపై మోదడంతో అతడికి గాయాలయ్యాయి. శివనాగరాజు, ఫిరోజ్ స్నేహితులు పరస్పరం దాడులు చేసుకున్నారు. పరస్పర దాడుల నేపథ్యంలో ఇరువర్గాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నట్లు ఎస్ఐ పృథ్వీ ఏకనాథ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద పెరుగుతున్న వరద ఉధృతి

● దిగువకు 2.57 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల

తాడేపల్లి టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 2లక్షల 75వేల 699 క్యూసెక్కుల వరద నీరు శనివారం ఇన్‌ఫ్లోగా నమోదయినట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 2 లక్షల 57 వేల 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. తూర్పు డెల్టా కాలువకు 10,085 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 8,216 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్ కాలువకు నీటి విడుదల ను నిలిపివేసినట్లు చెప్పారు. వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో బ్యారేజి దిగువన నదీతీర ప్రాంతం వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

సంక్షేమ పథకాల అమలులో కూటమి సూపర్ హిట్

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు అమలులో కూటమి ప్రభుత్వం సూపర్ హిట్ అయిందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లకు దసరా కానుకగా డ్రైవర్ల సేవ పథకం కింద వారి బ్యాంకు ఖాతాల్లో రూ.15 వేలు అందించారని చెప్పారు. శనివారం తాడికొండ మార్కెట్ యార్డులో ఆటో డ్రైవర్లకు ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కులం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా అమలు చేస్తోందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.90లక్షల మంది లబ్ధిదారులకు రూ.436 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. ఆటో డ్రైవర్లు ఎప్పటికప్పుడు బండి మరమ్మతులు చేయించుకుంటూ, కాగితాలు సక్రమంగా అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. లైసెన్స్ కలిగిన వారే ఆటోలు నడపాలని, మైనర్ల చేతికి వాహనాలు ఇవ్వొద్దని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం మార్కెట్ యార్డు నుంచి తాడికొండ మెయిన్ రోడ్డు వరకు ఆటోలో ప్రయాణించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, సీనియర్ నాయకులు ఎడ్డూరి హనుమంతరావు, బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జి కంతేటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న బూర్ల రామాంజనేయులు, కూటమి నాయకులు

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ప్రయోజనం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సూచించారు. శనివారం జీఎస్టీ తగ్గింపుపై గోరంట్ల, నగరాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన పెంచే విధంగా ప్రతి వ్యాపార ప్రదేశంలో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని వ్యాపారులకు సూచించారు. ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం దేశం ఆర్థికాభివృద్ధి దిశగా పయనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రత్తిపాడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చి ప్రజల ఆకాంక్షల మేరకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే రామాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు, మీడియా కో-ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరాంప్రసాద్, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ కుర్రి సుబ్బారెడ్డి, మాజీ జడ్పీటీసీ డక్కుమళ్ల భాగ్యారావు, ఆయా మండల, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలనాపాలన కరువై..

● వృద్ధుడిని ఆస్పత్రి ప్రాంగణంలో వదిలి వెళ్లిన కుమారుడు
● ఆయన వస్తాడని ఏ రోజుకారోజు పడిగాపులు
● ఇంటికి తీసుకెళ్లమని విలపిస్తున్న తండ్రి



హస్పిటల్ వద్ద రోదిస్తున్న బాషాఖాన్

చీరాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న ఆయనకు నేడు ఆల నాపాలన కరువైంది. కన్న కుమారుడే ఆ వృద్ధుడిని చీరాల వైద్యశాల ప్రాంగణంలో వదిలి వెళ్లడంతో 25 రోజులుగా ఆయన తల్లడిల్లుతున్నాడు. పెద్దవడ్లపూడిలోని తన ఇంటికి చేర్చాలని ఆయన విలపించడం పలువురిని విస్మయానికి గురిచేస్తోంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు గుంటూరు జిల్లా మంగళగిరి మండలం పెదవడ్లపూడికి చెందిన బాషాఖాన్ వృద్ధాప్యంలో ఉన్నాడు. ఈ క్రమంలో ఏసీ మెకానిక్ పని చేస్తున్న కుమారుడు అబ్దుల్ హుస్సేన్‌సాబ్ 25 రోజుల క్రితం బాషాఖాన్‌ను చీరాలకు తీసుకొచ్చాడు. ఇక్కడి వైద్యశాలలో చూపిస్తానని చెప్పి, ప్రాంగణంలోని మెట్ల వద్ద కూర్చొబెట్టాడు. లోనికి వెళ్లి ఓపీ రాయించుకొని వస్తానని చెప్పి వెళ్లాడు. ఆ రోజు నుంచి కొడుకు తిరిగి రాలేదు. దీంతో కుమారుడి కోసం చుట్టుపక్కల వెదికి దిక్కుతోచని స్థితిలో తండ్రి విలపిస్తున్నాడు. అయితే ఆస్పత్రి ప్రాంగణంలో స్వచ్ఛంద సంస్థలు అన్నదానం చేస్తుండటంతో ఎలాగోలా నెట్టుకొస్తున్నాడు. రాత్రుళ్లు అరుగులపై పడుకుని ఏడుస్తున్నట్లు సిబ్బంది, రోగులు చెబుతున్నారు. ఇప్పటికైనా తనను కుటుంబం చెంతకు చేర్చాలని ఆయన విలపిస్తున్నాడు.

నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ కార్యవర్గం ఎన్నిక

మంగళగిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మంగళగిరి తాలూకా యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారి కూరాకుల శ్రీనివాసరావు తెలిపారు. అధ్యక్షుడిగా కలిగిరి శ్రీరాములు, సహాధ్యక్షుడిగా దాసరి జోసెఫ్, ఉపాధ్యక్షులుగా వి.సీతారామశాస్త్రి, ఎస్.సాగర్, బి.నాగబ్రహ్మయ్య, డాక్టర్ ఎ.సతీశ్‌కుమార్, కె.శాంతిలక్ష్మి, కార్యదర్శిగా దానబోయిన బాలనాగేశ్వరరావు, కార్య నిర్వాహక కార్యదర్శిగా వీసీహెచ్ లాజరు, సంయుక్త కార్యదర్శులుగా సీహెచ్ మురళీకృష్ణ, ఎం.అనిల్‌కుమార్, జి.చంద్ర కోటేశ్వరరావు, టి.వెంకటేశ్వరరావు, ఎం.అమలాజ్యోతి, కోశాధికారిగా బి.రత్నబాబు, డిస్ట్రిక్ట్ ఎగ్జిక్యూటివ్ మెంబరుగా పి.కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు.

హామీల అమలే కూటమి ప్రభుత్వ లక్ష్యం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న రావి శివరామకృష్ణయ్య

పెదనందిపాడు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను అమలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య అన్నారు. ఉండవల్లిలో సీఎం చంద్రబాబునాయుడు ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవం కార్యక్రమానికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బస్సును స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలే కాకుండా ప్రజాసమస్యలను దృష్టిలో ఉంచుకుని అనేక పథకాలను నూతనంగా రూపొందించి లబ్ధిదారులకు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో స్వామిరెడ్డి, ఐటీడీపీ నియోజకవర్గ కార్యదర్శి దివ్వి నాగరాజు, రామినేని శ్రీనివాసరావు, నూతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనపర్రులో విద్యుత్ సమస్య పరిష్కారం

● ఆంధ్రజ్యోతి కథనంతో అధికారుల స్పందన

పెదనందిపాడు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అన్నపర్రు ఎస్సీ కాలనీలో విద్యుత్ సమస్యను అధికారులు ఎట్టకేలకు పరిష్కరించారు. అధికారులు గ్రామంలో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కాలిపోయిన విద్యుత్ తీగలను తొలగించి వాటి స్థానంలో నూతన వైర్లను అమర్చారు. దీంతో విద్యుత్ పునరుద్ధరణ అయ్యింది. ఆంధ్రజ్యోతిలో వెలువడిన అంధకారంలో అన్నపర్రు ఎస్సీ కాలనీ పేరుతో కథనం వెలువడింది. దీంతో విద్యుత్ అధికారులు సమస్యను పరిష్కరించారు. తమ సమస్య పరిష్కారం అవ్వడంతో కాలనీవాసులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో సర్పంచ్ కన్నుమూత

కాకుమాను, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకుమాను సర్పంచ్ పసుపులేటి శివకుమారి(62) శుక్రవారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. 2021 సర్పంచ్ ఎన్నికల్లో గ్రామంలో ఏకగ్రీవంగా ఆమె ఎంపికయ్యారు. జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి నివాళర్పించారు.

చంద్రబాబు, పవన్, లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

తాడేపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు ఆటో కార్మికులు టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ఆటో డ్రైవర్లకు రూ.15వేలను వారి బ్యాంకు అకౌంట్లలో జమ చేసిన సందర్భంగా శనివారం ఉండవల్లిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్మిక సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు దాసరి కృష్ణ, వంగా నరేంద్ర, దొప్పలపూడి జ్యోతిబసు, తోట సాంబశివరావు, గాదె బసివిరెడ్డి, రాయపూడి కిరణ్, లీలాకృష్ణ, రాము, రమేశ్, బుచ్చిబాబు, నరేశ్, చైతన్య, పవన్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం దేవాలయ ట్రస్టు బోర్డు సభ్యుడిగా శంకరశెట్టి

తాడేపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవాలయ ట్రస్టుబోర్డు సభ్యుడిగా తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామానికి చెందిన శంకరశెట్టి పిచ్చయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శంకరశెట్టి పిచ్చయ్య ఇప్పటం గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. పార్టీకి ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ఆయనకు ఈ పదవి లభించింది. ఈ సందర్భంగా పిచ్చయ్య ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తనకు దేవుని సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాలను శిరసా వహిస్తానన్నారు

బహిరంగ ప్రకటన

షేక్ మస్తాన్‌బీ W/o. షేక్ ఖలీల్, డోర్ నెం : 11-66, సీతారామకోవెలవీధి, పాత మంగళగిరి, మంగళగిరి మున్సిపల్, గుంటూరు జిల్లా, నా తల్లి షేక్ బీబీ గారి పేరిట గల ఆస్తికి సంబంధించిన దస్తావేజు నెం. **3814/1987** పెదకాకాని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు దగ్గర గల జిరాక్స్ షాపు నందు జిరాక్స్ కాపీలను తీసుకొని మంగళగిరి వచ్చుచుండగా సదరు దస్తావేజులు గల కవర్ మార్గ మధ్యములో పోయినవి. ఎంత వెతికినను కనిపించలేదు. సదరు దస్తావేజులు గల కవర్ ఎవరికైనా దొరికిన యెడల తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వగలము.

షేక్ మస్తాన్ బీ, W/o. షేక్ ఖలీల్, డోర్ నెం: 11-66, సీతారామకోవెలవీధి, పాత మంగళగిరి, మంగళగిరి మున్సిపల్, గుంటూరు జిల్లా, ఫోన్ నెం: 9059919607.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్లు అయిన **(1) దామచర్ల త్రివేణి, భర్త: కిరణ్ కుమార్, (2) దామచర్ల నిఖిత, తండ్రి : కిరణ్ కుమార్,** 2వ వారు మైనర్ అయినందున గార్డియన్ తల్లి దామచర్ల త్రివేణి గారు, మేడికొండూరు గ్రామ కాపురస్తురాలు వలన సమాచారమును పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా! దామచర్ల సుబ్బాయమ్మ గారు మాలెంపాటి వినోదకి మరియు నా క్లయింట్లలో 1వ వారి భర్త కిరణ్ కుమార్కు తల్లి అయివున్నది. మాలెంపాటి లక్ష్మి అను వారు వినోదకి కుమార్తె అయివున్నది. సుబ్బాయమ్మ గారి భర్త మరియు త్రివేణి భర్త వారి పూర్వార్జితపు ఆస్తుల గురించి ఎవరికీ ఎటువంటి దస్తావేజులు వ్రాయకుండా మరణించియున్నందున సదరు ఆస్తులు అన్నియు పై తెలిపిన సుబ్బాయమ్మ గారు, ఆమె కుమార్తె, మనుమరాలు మరియు నా క్లయింట్లు ఉమ్మడిగా అనుభవించుచున్నారు. వారికి కుటుంబ బేధాభిప్రాయములు వచ్చుటచే నా క్లయింట్లు ప్లీడర్ ద్వారా సదరు ఆస్తుల భాగపంపిణీల కొరకు సుబ్బాయమ్మ వగైరాలకు **దీ. 01.10.2025న** నోటీసులు పంపియుండగా సదరు నోటీసులు సుబ్బాయమ్మ తీసుకొని, సదరు నోటీసులో ఉదహరించిన ఆస్తులను అన్యాక్రాంతములు చేసి తను అక్రమముగా లాభము పొందవలెననే దురుద్దేశంతో ఉండిఉన్నారని, సదరు ఆస్తులను విక్రయం చేయుటకు ప్రయత్నములు చేయుచున్నారని, కావున అటువంటి క్రయ విక్రయములు, తనఖాలు చేసినను అవి చట్టరీత్యా చెల్లనేరవని, కావున సదరు ఆస్తులపై ఎవరూ, ఎటువంటి లావాదేవీలు చేయరాదని, అటుల చేసిన యెడల నా క్లయింట్లు అటువంటి క్రయ విక్రయములపై మరియు సదరు ఆస్తులు అనగా మేడికొండూరు గ్రామ (1) సర్వే నెం. 292-1 యు॥ 1.45 సెంట్లు (2) సర్వే నెం. 591-ఎ1 యు॥ 1.98 సెంట్లు, (3) సర్వే నెం. 316 నందు డోర్ నెం. 4-8/1 యు? 0.15 సెంట్లులో గల ఆర్.సి.సి. డాబా యిల్లు, (4) సర్వే నెం. 640/బి, 639/సి నందు యు॥ 0.10 సెంట్ల ఖాళీ స్థలము సంబంధించి వ్రాయించుకున్న వ్యక్తులపై కోర్టు ద్వారా చర్యలు తీసుకొనునని, తద్వారా తమకు రావలసిన వాటా ఆస్తిని పొందగలరని యావన్మందికి ఈ పేపర్ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ఇట్లు : **టి. మల్లికార్జునరావు,** అడ్వకేట్

కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో 100 ఆటోలతో భారీ ర్యాలీ



జెండా ఊపి ప్రదర్శనను ప్రారంభిస్తున్న కొమ్మారెడ్డి కిరణ్ తదితరులు

తాడేపల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆటో సోదరులకు పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, తాడేపల్లి మండల మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్ అన్నారు. శనివారం మండలంలోని గుండిమెడ గ్రామం నుంచి సీతానగరం ప్రకాశం బ్యారేజి వరకు కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఆటో డ్రైవర్ల కష్టాలను చూసి ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చారన్నారు. స్త్రీశక్తి పథకం అమలు సమయంలోనే ఆటో కార్మికులను ఆదుకునేందుకు పథకం తెస్తామని సీఎం చంద్రబాబు చెప్పారని, అనుకున్న విధంగానే అమలు చేశారని అన్నారు. కార్మికుల కోసం కూటమి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందని కొమ్మారెడ్డి కిరణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మారెడ్డి కిరణ్, కూటమి నేతలు చిగురుపాటి సుబ్బారావు, కాసరగడ్డ శ్రీనివాసరావు, నామతోటి రాంబాబు, ఖాసింబాబు, అంకినీడు, ఇప్పటం పీఏసీఎస్ ఛైర్మన్ బాపయ్య, ఆటో డ్రైవర్లు, కూటమి నేతలు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

పొన్నూరు, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): అగ్ని బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని వైసిపి జిల్లా ప్రతినిధి ఎండేటి వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని వల్లభరావుపాలెం గ్రామంలో అగ్ని బాధిత కుటుంబాలకు వైసీపీ అధికార ప్రతినిధి సుబ్బయ్య పరామర్శించారు. నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ ద్వారా బాధిత కుటుంబాలకు నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు స్థలం కేటాయించడంతోపాటు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్టీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

రేపు మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై సమావేశం

తెనాలి అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తెనాలి పురపాలక సంఘ మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు ప్రజల అభిప్రాయాల కోసం సోమవారం సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు తెలిపారు. ఆర్‌వీ ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ వారికి మాస్టర్ ప్లాన్ విజన్ డాక్యుమెంట్ తయారు చేసే బాధ్యత అప్పగించారని చెప్పారు. ప్రజలు, పలు సంస్థలు, కమ్యూనిటీ గ్రూపులు, స్టేక్ హోల్డర్స్ సమావేశానికి వచ్చి తమ అభిప్రాయాలు, సూచనలు అందించాలని కోరారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో మధ్యాహ్నం సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొంటారని చెప్పారు.

నేడు హిందీ గురుపీఠ పురస్కారం ప్రదానం

తెనాలి అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): హిందీ ప్రచార గురుపీఠ పురస్కార ప్రదానం ఆదివారం నాజరుపేటలోని హిందీ ప్రేమీ మండలిలో నిర్వహించనున్నారు. బోయపాటి దంపతుల గురుపీఠ పురస్కార సమితి ఆధ్వర్యంలో 28వ పురస్కార మహోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది పురస్కారాలను వెంకటేశ్వర విశ్వవిద్యాలయం హిందీ విభాగం ఆచార్యులు నారాయణ, కాకినాడ విశ్రాంత హిందీ అధ్యాపకురాలు షేక్ ఖాసింబీలకు ప్రదానం చేస్తారు. పాలడుగు లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించే సభలో రావెల సాంబశివరావు ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ● నియోజకవర్గంలో 1694మందికి ఆర్థిక సాయం ● 'ఆటో డ్రైవర్ల సేవలో' నేతలు



పొన్నూరు: ఆటో డ్రైవర్లకు నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్



తెనాలి: నగదు చెక్కు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ అప్పలనాయుడు



తెనాలి: సీఎం, డిప్యూటీ సీఎం చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

పొన్నూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పాటుపడుతుందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పొన్నూరులో శనివారం ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా రేపల్లె బస్టాండ్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని 1694మంది ఆటోడ్రైవర్లకు రూ.15వేల చొప్పున రూ.2.54కోట్ల చెక్కును డ్రైవర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. అయితే మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవడంతో ఆటో డ్రైవర్లకు ఆర్థిక ఇబ్బందులు ఎదురైనట్లు ప్రభుత్వం గుర్తించినట్లు చెప్పారు. డ్రైవర్ల సంక్షేమానికి ఎన్నికల హామీని నెరవేర్చే విధంగా ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున అందజేసేందుకు ఆటో డ్రైవర్ల సేవ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారన్నారు. నియోజకవర్గంలో ఈ పథకం కింద దాదాపు ఆటో డ్రైవర్లందరూ అర్హులుగా గుర్తించబడ్డారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు, ప్రత్యేక అధికారి, డీఆర్డీ పీడీ విజయలక్ష్మి, రవాణా శాఖ అధికారి అమృత, కూటమి పార్టీల నాయకులు, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

తెనాలి అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు సాయం అందించే కార్యక్రమాన్ని మార్కెట్ సెంటర్‌లో శనివారం సంబరంగా జరుపుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహ్మద్ ఖుద్దూస్ మాట్లాడుతూ, ఆటోడ్రైవర్లకు కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఆటోడ్రైవర్ల సేవలో ఊరట కల్పిస్తుందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని చెప్పారు. టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, అన్నం పిన్నారావు, జొన్నాదుల మహేష్, కోగంటి రోహిత్, శ్రీధర్, దేవినేని రమాదేవి, శ్రీధర్, మల్లేశ్వరి, రమాదేవి పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు ఆసరాగా..

తెనాలి అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం ప్రకటించిన పథకం ఆసరా అవుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక చెప్పారు. ఆటోడ్రైవర్ల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి ఆటోడ్రైవర్లకు రూ.15వేల సాయం అందిస్తుందన్నారు. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమిషనర్ అప్పలనాయుడు, ఎంతః శ్రీకాంత్, ఎంవీఐ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

వడ్లమూడి ఉరుసు మహోత్సవాలలో ఎమ్మెల్యే నరేంద్ర



భక్తులతో ఎమ్మెల్యే నరేంద్రకుమార్

చేబ్రోలు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో గార్మి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవాలకు పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ఆహారం పంపిణీ చేశారు. గ్రామస్తుల సమష్టి కృషి, భక్తుల ఉత్సాహం, ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ ఉరుసు మహోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక భక్తులు, పరిసర గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో వడ్లమూడి గ్రామం కిటకిటలాడింది.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనోత్సవాలు



కొల్లిపర శ్రీవీరభద్రస్వామికాలనీలో అమ్మవారిని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కొల్లిపర, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీదుర్గాదేవి నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండలంలో వల్లభాపురం, మున్నంగి, తూములూరు, చక్రాయపాలెం, అత్తోట, దావులూరుపాలెం తదితర గ్రామాల్లో ఏర్పాటుచేసిన శ్రీదుర్గాదేవి విగ్రహాలకు భక్తులు 13 రోజుల నుంచి వైభవంగా పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ట్రాక్టర్‌పై ఊరేగింపు నిర్వహించి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. అదేవిధంగా కొల్లిపర శ్రీవీరభద్రస్వామికాలనీలో ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహానికి ఘనంగా పూజలు నిర్వహించి ట్రాక్టరుపై శ్రీదుర్గాదేవి అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలతో, డబ్బు వాయిద్యాలతో, బాణాసంచా కాల్చుకుంటూ గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించి కృష్ణానదిలో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.



చింతలపూడిలో అమ్మవారి గ్రామోత్సవం



తెనాలిలో జరిగిన అమ్మవారి ఊరేగింపులో మహిళలు



అన్నదానం ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే ఉమ

చేబ్రోలులో వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం

చేబ్రోలు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు గ్రామంలోని కూరగాయల మార్కెట్ సెంటర్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం గ్రామోత్సవం ప్రత్యేకంగా నిర్వహించగా, భక్తుల సందోహంతో గ్రామం అంతా పండుగ వాతావరణంలో మునిగిపోయింది. డప్పుల మోతలతో, కోలాటాల నడుమ అమ్మవారి విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. ఈ ఊరేగింపులో వందలాది మంది భక్తులు పాల్గొని "జయజయ మహాదుర్గా" నినాదాలతో గ్రామం మారుమోగించారు. అమ్మవారి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లడ్డూ లక్కీ డ్రా భక్తులను ఆకర్షించింది. గ్రామోత్సవం అనంతరం అమ్మవారి విగ్రహాన్ని కొమ్మమూరు కాలువలో నిమజ్జనం చేశారు. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో అమ్మవారి ఊరేగింపును భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, భక్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఊరేగింపును వైభవంగా జరిపారు. అనంతరం అమ్మవారిని చేబ్రోలు పరిధిలోని కొమ్మమూరు కాలువలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి గ్రామోత్సవం

పొన్నూరు, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో నవరాత్రి పూజలు అందుకున్న అమ్మవారి బ్రహోత్సవాలు శనివారం భక్తి శ్రద్ధలతో జరిగింది. నవరాత్రి సందర్భంగా వివిధ అలంకారాల్లో పూజలు అందుకున్న అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించిన వాహనంపై అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి సాంప్రదాయ డప్పు వాయిద్యాలు కోలాట ప్రదర్శనల నడుమ అమ్మవారి గ్రామోత్సవం కన్నుల పండుగ జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన బతుకమ్మ పూజలు

తెనాలి అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మారీసుపేటలో నిర్వహిస్తున్న బతుకమ్మ అమ్మవారి పూజలు శనివారం ముగిశాయి. శివాలయం ఆవరణలో బతుకమ్మ ఉత్సవ మహిళ సంఘం ఆధ్వర్యంలో గత 22 నుంచి శుక్రవారం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని రథంపై పట్టణ ప్రధాన వీధుల్లో ఘనంగా ఊరేగించారు. కమిటీ అధ్యక్షురాలు గ్రంధి గిరిజారాణి, కార్యదర్శి వరదా విజయలక్ష్మి, రత్నకుమారి, శివనాగలక్ష్మి, సుశీల, కాంచన, హేమలత తదితరులు పాల్గొన్నారు.

శివాజీ చౌక్‌లో భక్తులకు అన్నదానం

తెనాలి అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా శివాజీచౌక్‌లో భక్తులకు అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ శనివారం ప్రారంభించారు. కాళీమాత ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో కమిటీ సభ్యులకు దాతలు అందిస్తున్న సహకారం కొనసాగాలన్నారు. కమిటీ అధ్యక్షుడు గుమ్మడి రమేష్, కార్యదర్శి యర్రు శ్రీనివాసరావు, సభ్యులు పర్యవేక్షించారు.



లోగో విడుదల చేస్తున్న సాయి, హేమంత్

భాషా సంరక్షణకు తెలుగు వెలుగు లఘు చిత్ర నిర్మాణం

తెనాలి అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మాతృభాషను కాపాడేందుకు తెలుగు వెలుగు లఘు చిత్రాన్ని నిర్మించామని స్వరలయ స్టూడియోస్ నిర్వాహకులు సాయి లక్కరాజు చెప్పారు. మారీసుపేటలోని కార్యాలయంలో శనివారం లోగోను ఆవిష్కరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కాలం గడిచే కొద్ది భాషను మరిచిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. ఉపాధి అవకాశాలకు విద్యార్థులకు ఆంగ్లభాష అవశ్యకత ఉన్నప్పటికి మాతృభాషను మరిచిపోకూడదన్నారు. తల్లిదండ్రులు తీరిక వేళల్లో తెలుగు భాషను చదవడం, రాయడం నేర్పించాలని కోరారు. లఘు చిత్రాన్ని యూట్యూబ్ ఛానల్‌లో ఆదివారం విడుదల చేస్తున్నట్లు తెలిపారు. హేమంత్, కిరణ్‌తేజ, దనుష్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

కొల్లిపర, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దావులూరిపాలెంలో జరిగిన అగ్నిప్రమాదంలో వేముల మంగమ్మ పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలిపోవడంతో శనివారం మండల ఉపాధ్యక్షుడు అద్దంకి బోసుబాబు నిత్యావసర సరుకులు, దుస్తులు, నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా బోసుబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా నూతన గృహాన్ని కట్టించటానికి తన వంతు కృషి చేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఏమినేని వెంకటసాయి, కామినేని నాంచారయ్య, కాటూరి సాంబశివరావు, కామినేని రాంబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీడీసీసీ బ్యాంక్ మేనేజర్ బాజీబాబా

సక్రమంగా చెల్లిస్తే అధిక రుణాలు

● జీడీసీసీ బ్యాంక్ మేనేజర్ బాజీబాబా

కొల్లిపర, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాన్ని సక్రమంగా చెల్లిస్తే అధికంగా రుణాలు ఇవ్వటానికి అవకాశం ఉందని జీడీసీసీ బ్యాంక్ కొల్లిపర బ్రాంచి మేనేజర్ షేక్ బాజీబాబా అన్నారు. శనివారం మండల పరిధిలోని అత్తోట పీఏసీఎస్‌లో రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొల్లిపర బ్రాంచి పరిధిలో ఇప్పటి వరకు రైతులకు రూ 102 కోట్ల వరకు వివిధ రూపాల్లో రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. అదే విధంగా ఈ ఖరీఫ్‌లో రైతులకు రూ.7కోట్ల 61లక్షల వరకు ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, ఫీల్డ్ ఆఫీసర్ టి. ప్రవీణ్, సొసైటీ కార్యదర్శి గనిపిశెట్టి విజయ భాస్కర్, గ్రామ పెద్దలు కొరారు అంజనేయులు, దాసరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్ సాంబయ్య మృతి

తెనాలి అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం ఖాజీపేట శివాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రాచర్ల సాంబయ్య (85) శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. దుగ్గిరాల మాజీ ఎంపీపీ వెనిగళ్ల కృష్ణప్రసాద్ తదితరులు నివాళులర్పించారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మరింత మేలు

● దుగ్గిరాల యార్డు మాజీ చైర్మన్ సాంబిరెడ్డి



వల్లభాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

కొల్లిపర, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మరింత మేలు జరుగుతుందని దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని వల్లభాపురంలో జీఎస్టీ తగ్గింపుపై అధికారులు, యానిమేటర్లు, నాయకులు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు కారణంగా మార్కెట్‌లో అనేక వస్తువులకు ధరలు తగ్గే అవకాశం ఉందన్నారు కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నిత్యావసర సరుకులు, మందులు, విద్య, వస్త్రాలు, రవాణా వంటి విభాగాల్లో జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మీ, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, ఏపీఎం రమాదేవి, నాయకులు విప్పల రమేష్‌రెడ్డి, బొట్టా శ్రీరాములురెడ్డి, అవుతు సత్యన్నారాయణరెడ్డి, లంకిరెడ్డి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రతి ఒక్కరికి ప్రయోజనం

పొన్నూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 తగ్గింపు ప్రయోజనాలు ప్రతి ఒక్కరికి లభించాలని జౌళి శాఖ అభివృద్ధి అధికారి జె రాజవర్ధన్ అన్నారు. పట్టణంలోని నిడుబ్రోలు చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో అధికారులు మాట్లాడుతూ ప్రజలకు లభించే ప్రయోజనాలు, సూపర్ జీఎస్టీ ద్వారా వ్యాపారులకు కలిగే లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో జౌళి శాఖ అభివృద్ధి అధికారి బి.శ్రీధర్ బాబు, వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ వైవీ కృష్ణవేణి, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎల్ రాధిక, ఎంపీడీవో జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జేన్ గూడెల్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి



జేన్ గూడెల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ జి.సింహాచలం

ఏఎన్‌యూ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జీవ సంక్షేమం, పర్యావరణ పరిరక్షణపై జేన్ గూడెల్ చేసిన పరిశోధనలు యువత ఆదర్శంగా తీసుకోవాలని రిజిస్ట్రార్ జి.సింహాచలం అన్నారు. శనివారం వర్సిటీలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గూడెల్ వర్ధంతి కార్యక్రమంలో రిజిస్ట్రార్ సింహాచలం పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రఖ్యాత పర్యావరణవేత్త ఎథోలాజిస్ట్, ప్రిమటాలజిస్ట్, ఆంత్రోపాలజిస్ట్, జీవహక్కుల పోరాట యోధురాలు జేన్‌గూడెల్ చేసిన పరిశోధనలను యువత, పరిశోధకులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. పర్యావరణ విభాగాధిపతి ఆచార్య స్వామి మాట్లాడుతూ జీవుల మధ్య సామరస్యాన్ని కాపాడడానికి జేన్ గూడెల్ చేసిన కృషి అమోఘమైందని తెలిపారు. బీఓఎస్ చైర్మన్ డాక్టర్ పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ మానవుడు, చింపాంజీల మధ్య అంతఃసంబంధాలను పరిశోధించడం ద్వారా గూడెల్ పర్యావరణ పరిరక్షణకు జీవుల మధ్య సామరస్యం ఎంతో కీలకమని ధ్రువీకరించారన్నారు. వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చేబ్రోలు లింగరాజు, వర్సిటీ ఎలక్ట్రికల్ డీఈఈ ఎస్.వెంకటేశ్వర్లు, డిప్యూటీ వార్డెన్లు డాక్టర్ బాబు, డాక్టర్ కె.శశిధర్ పాల్గొన్నారు.

కాపు జేఏసీ వ్యవస్థాపకుడు జనార్ధన్‌కు సన్మానం



జనార్ధన్‌ను సన్మానిస్తున్న సమితి సభ్యులు

తెనాలి అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కాపు జేఏసీ వ్యవస్థాపకుడు చందు జనార్ధన్‌ను శనివారం సన్మానించారు. రాధారంగా కాపు యువజన సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తన్నీరు శివశంకర్ మాట్లాడుతూ, కాపుల ఆత్మాభిమానానికి భంగం కలిగించే జీవోను ఆయన నిలుపుదల చేసేందుకు కృషి చేశారని చెప్పారు. దొమ్మరులను గిరిబలిజలుగా, మార్చేందుకు ప్రభుత్వం గతంలో జీవో జారీ చేసిందన్నారు. కాపుల హక్కుల సాధనకు ఆయన పోరాటం చేశారని చెప్పారు. 12 అంశాలతో కాపుల హక్కులు కాపాడేందుకు ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చారన్నారు. సుబ్రహ్మణ్యం, రవికుమార్, హనుమంతరావు, భాస్కరరావు, శ్రీనివాసరావు, రజనీ, మోహన్ పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఆరోగ్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తెనాలి అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని ఎస్‌బీఐ ప్రధాన శాఖలో విశ్రాంత ఉద్యోగులకు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని రీజనల్ మేనేజర్ జగదీష్‌కుమార్ ప్రారంభించారు. ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని చెప్పారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రీజియన్ పరిధిలోని తెనాలితో పాటు పొన్నూరు, బాపట్లలో కూడా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విశ్రాంత ఉద్యోగులకు బాసటగా నిలుస్తుందన్నారు. మేనేజర్ వాసుదేవరావు, తిరుమలరావు, మణికంఠ, సాయిలక్కరాజు పాల్గొన్నారు.